

ఉక్కు ఉద్యోగులకు అందని జీతాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 20: స్టీల్‌ప్లాంటు ఉద్యోగులకు ఏప్రిల్ నెల జీతాలు ఇంకా అందలేదు. గత కొన్ని నెలలుగా వేతనాలు ఆలస్యమవుతున్నాయి. అయితే ఇంత జాప్యం ముందెన్నడూ జరగలేదు. జీతాల విషయంలో యాజమాన్యం తీరుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. హుద్‌హుద్, కరోనా సమయాల్లో కూడా ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందేవి. కానీ గత ఆరు నెలలుగా ఆలస్యమవుతోంది. ఇదిలావుండగా జీతాల గురించి కార్మిక సంఘాల నాయకులు కూడా మాట్లాడకపోవడంపై కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఓటెత్తిన గ్రామీణం

పద్మనాభం మండలం బుడ్డివలస అగ్రహారంలో 96.83 శాతం ఓటింగ్ నమోదు



పద్మనాభం మండలం పాండ్రంగిలో బారులుతీరిన ఓటర్లు (ఫైల్ ఫొటో)

- పురుషులు 229 మందికిగాను 226 మంది, మహిళలు 244కి 232 మంది ఓటుహక్కు వినియోగం
- అదే మండలం మరో బూత్‌లో 96.63 శాతం
- విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని భీమిలి, ఎస్.కోట నియోజక వర్గాల్లో 90%, అంతకంటే ఎక్కువ ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలు 131
- 90 శాతం దాటిన పోలింగ్ బూత్ నగరంలో ఒక్కటీ లేదు
- పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని విమాననగర్‌లో కేవలం 7.74 శాతం ఓటింగ్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి):

విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో గల గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ భారీగా జరిగింది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే నగరంలో తక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా భీమిలి నియోజకవర్గం పద్మనాభం మండలం బుడ్డివలస అగ్రహారం పోలింగ్ బూత్ నంబరు 13లో 473 మంది ఓటర్లు ఉండగా 458 మంది (96.83 శాతం) ఓటు వేశారు. పురుషులు 229 మందికిగాను 226 మంది ఓటు హక్కు వినియోగించుకోగా కేవలం ముగ్గురు మాత్రమే ఓటుకు దూరంగా ఉన్నారు. మహిళలు 244కి మందికి 232 మంది ఓటు వేశారు. ఇదే మండలంలోని బూత్ నంబరు 46లో 772 మందికిగాను 746 మంది (96.63 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక అతి తక్కువగా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని బూత్ నంబరు 213లో 620 మంది ఓటర్లకు కేవలం 48 మంది (7.74 శాతం) మాత్రమే ఓటు వేశారు.

భీమిలి, ఎస్.కోట నియోజక వర్గాల్లోని 131 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతం అంతకంటే ఎక్కువ ఓటింగ్ జరిగింది. భీమిలి నియోజకవర్గంలో 50, ఎస్.కోట నియోజకవర్గంలో 81 కేంద్రాల్లో 90 శాతం దాటి పోలింగ్ నమోదైంది. 90 శాతం దాటిన పోలింగ్ బూత్‌లలో నగరంలో ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం. అయితే ఓటింగ్ శాతాన్ని కాకుండా ఓట్లు ఎక్కువగా పోలైన బూత్‌లు చూస్తే 119 మంది కేంద్రాల్లో 1000 ఓట్లు దాటి పోలయ్యాయి. వీటిలో భీమిలి నియోజక వర్గంలో 50, విశాఖ తూర్పులో 25, ఎస్.కోటలో 15, గాజువాకలో 14, పశ్చిమలో 7, విశాఖ ఉత్తరం నియోజకవర్గంలో 6, దక్షిణ నియోజకవర్గంలో రెండు కేంద్రాలు ఉన్నాయి.

మొత్తంగా 1,962 పోలింగ్ కేంద్రాల్లో 19,27,303 మంది ఓటర్లు ఉండగా వీరిలో 9,48,403 మంది పురుషులు, 9,78,785 మంది మహిళలు, 115 మంది ట్రాన్స్‌జండర్లు ఉన్నారు. వీరిలో 13,70,484 మంది ఓటు వేశారు. పార్లమెంటు పరిధిలో ఎస్.కోటలో అత్యధికంగా 85.45 శాతం మంది, తక్కువగా విశాఖ దక్షిణ నియోజక వర్గంలో 62.42 శాతం పోలింగ్ నమోదైంది.

భీమిలి నియోజకవర్గంలో...

భీమిలి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 3,63,013 మంది ఓటర్లు ఉండగా 275,747 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరి కోసం 359 బూత్‌లు ఏర్పాటుచేశారు. నియోజకవర్గంలో సగానికి పైగా

... మిగతా 4వ పేజీలో

డెంగ్యూ బెల్స్

ఈ ఏడాది అప్పుడే వెలుగుచూస్తున్న కేసులు

- ఇప్పటివరకూ 140 నమోదైనట్టు మలేరియా శాఖ నిర్ధారణ

వర్షాలు కురుస్తుండడంతో దోమలు వ్యాప్తి

- అధికారులు మేల్కొనకుంటే సీజన్‌లో మరింత పెరిగే అవకాశం
- జీవీఎంసీ అధికారులు కార్యాచరణ
- హైరిస్క్ ప్రాంతాల్లో లార్వా గుర్తింపునకు సర్వే లెన్స్



పాజిటివ్ కేసు వచ్చిన ఇంటి పరిసరాల్లో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఈ ఏడాది అప్పుడే డెంగ్యూ కేసులు వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో దోమల వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో డెంగ్యూ కేసులు నమోదవుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నెల రోజులు ముందుగానే డెంగ్యూ కేసుల నమోదు ప్రారంభం కావడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

ఏటా జూన్‌లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో వర్షాలు ప్రారంభమవుతుంటాయి. దీనివల్ల వాతావరణ చల్లబడుతుంది. ఇది దోమల వ్యాప్తికి అనుకూలంగా మారుతుంది. వర్షాకాలంలో పారిశుధ్యలోపం తలెత్తుతుంది. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోవడం, డ్రైనేజీ పొంగి రోడ్లపైకి చేరుకోవడం, వర్షం నీరు ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి బొండాలు, పూల కుండీల్లో నిల్వ ఉండిపోవడం వల్ల దోమల వ్యాప్తి మరింత ఎక్కువగా ఉంటుంది. సాధారణ దోమలతోపాటు డెంగ్యూ కారక దోమలు (ఈడిస్) కూడా విజృంభిస్తుంటాయి. వీటన్నింటి కారణంగా ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకూ డెంగ్యూ కేసుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. డెంగ్యూ బారిన పడినవారు సకాలంలో చికిత్స తీసుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. దీంతో డెంగ్యూ అంటే ప్రజలతోపాటు జీవీఎంసీ అధికారుల్లో ఆందోళన మొదలవుతుంది.

నగరంలో ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకూ 1,500 నుంచి రెండు వేల వరకూ డెంగ్యూ కేసులు నమోదవుతుంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం మే నుంచే డెంగ్యూ కేసుల నమోదు ప్రారంభమైంది. గతకొద్దిరోజులుగా అడపాదడపా వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడి దోమల వ్యాప్తికి అనుకూలంగా మారింది. దీనివల్ల ఇప్పటివరకూ 146 డెంగ్యూ కేసులు నమోదవ్వగా వీటిలో దాదాపు సగం గత రెండు రోజుల్లో నమోదైన వేనంటున్నారు. ఈనెల మొదట్లో రోజుకి ఒకటి, రెండు చొప్పున నమోదైతే, ఇటీవల వీటి సంఖ్య భారీగా పెరిగినట్టు చెబుతున్నారు. జిల్లా మలేరియా విభాగం అధికారులు నగర పరిధిలో భారీగా డెంగ్యూ కేసులు నమోదవుతున్నట్టు జీవీఎంసీ అధికారులకు రోజువారీ నివేదికలు ఇస్తుంటే...అధికారులు మాత్రం అసలు డెంగ్యూ కేసు ఒక్కటి కూడా నమోదుకావడం లేదని బుకాయిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కొమ్మాది ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల యువకుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో కేజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడిని జిల్లా మలేరియా అధికారిని స్వయంగా వెళ్లి పరామర్శించారు. అయినప్పటికీ జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ అధికారులు మాత్రం అలాంటి కేసులు అధికారికంగా నిర్ధారణ కావడం లేదని చెప్పడం విశేషం. దీనికి సంబంధించిన ఫొటోలను చూపించేసరికి...ఒక కేసు మాత్రమే నమోదైందని, అక్కడ యాంటీ లార్వా ఆపరేషన్ చేసి, రెండుచోట్ల దోమల బ్రీడింగ్ గుర్తించి నాశనం చేశామని, ఆప్రాంతంలోని 151 ఇళ్లలో ఫాగింగ్ కూడా చేశామని చెప్పడం చూస్తే...జీవీఎంసీ అధికారులు డెంగ్యూపై గోప్యత పాటిస్తున్నారని అర్థమయ్యింది.

జీవీఎంసీ అధికారులు అప్రమత్తం

డెంగ్యూ కేసులు తీవ్రస్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందనే సంకేతాల నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్య విభాగం అధికారులు ఇప్పటికే ఒక కార్యాచరణ రూపొందించినట్టు తెలిసింది. మే

... మిగతా 4వ పేజీలో

రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడమే కారణం
- జిల్లాలో రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్లు...

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి):

ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా అందించే సేవలను ఈ నెల 22 నుంచి నిలిపివేయాలని నెట్‌వర్క్ పరిధిలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల అసోసియేషన్ నిర్ణయించింది. ప్రభుత్వం గడిచిన కొన్ని నెలల నుంచి బకాయిలను చెల్లించకపోవడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1,500 కోట్లు చెల్లించాల్సి ఉండగా, విశాఖలో 50కుపైగా ఆస్పత్రులకు రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్లు వరకూ చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మూడుసార్లు సమ్మె నోటీసులు ఇవ్వగా రెండు పర్యాయాలు రూ.300 కోట్లు వరకూ విడుదల చేసింది. అయినప్పటికీ బకాయిలు భారీగానే ఉండడంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా ఉందని ఆస్పత్రుల యాజమాన్యాలు పేర్కొంటు న్నాయి. ఈ నెల పదో తేదీన రూ.500 కోట్లు విడుదల చేస్తామని ఆరోగ్యశ్రీ సీఈవో ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో ఆస్పత్రులు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే పూర్తిస్థాయిలో వైద్య సేవలు నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నాయి.

పలు రైళ్లు రద్దు

- జాబితాలో సింహాద్రి ఎక్స్‌ప్రెస్, విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్, విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లు
- విశాఖ-రాజమండ్రి మెము రైళ్లు కూడా...

విశాఖపట్నం, మే 20: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో భద్రతాపరమైన నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈనెల 27 నుంచి జూన్ 23వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేశామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 27 నుంచి జూన్ 22వ తేదీ వరకూ మచిలీపట్నం- విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22708), ఈనెల 28 నుంచి జూన్ 23వ తేదీ వరకు విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244), విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22707) రద్దు చేశారు. అలాగే ఈనెల 27 నుంచి జూన్ 23వ తేదీ వరకు విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), రాజమండ్రి-విశాఖ మెము (07466), విశాఖ-రాజమండ్రి మెము (07467) రైళ్లు రద్దు చేసినట్టు వెల్లడించారు.

ఆలయ నిర్వహణపై వివాదం

తమకే అప్పగించాలని కోరిన 'సంపత్ వినాయక్' టెంపుల్ ట్రస్టీలు

- కుదరదని తేల్చి చెప్పిన దేవదాయ శాఖ
- ఈఓ నియామకంపైనా ట్రస్టీల అభ్యంతరాలు
- ఆ అధికారం దేవదాయ శాఖకు లేదని న్యాయస్థానానికి...
- ప్రస్తుత నిర్వాహకులపై ఆరోపణలు
- విచారణకు ఆర్‌జేసీ నియామకం



సంపత్‌వినాయగర్ ఆలయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని సంపత్ వినాయక ఆలయం నిర్వహణపై వివాదం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం ఐదేళ్లు మినహాయింపు ఇచ్చినా వ్యవస్థాపక ట్రస్టీలు సంతృప్తి చెందలేదు. గత నవంబరులో ఈ గడువు ముగిసిపోగా, మళ్లీ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే మినహాయింపు కుదరదని చెప్పి, జిల్లా దేవదాయ శాఖ అధికారిని ఈఓగా నియమిస్తే దానిపై ట్రస్టీ కోర్టుకు వెళ్లారు. ఈఓలను ప్రభుత్వం నియమించాలని, దేవదాయ శాఖ నియమించకూడదంటూ కొత్త వాదన తెరపైకి తెచ్చారు. ఏదో ఒకలా ఆలయ నిర్వహణ తమ చేతుల్లోనే ఉండాలని ట్రస్టీలు తాపత్రయ పడుతున్నారు.

ఇదిలావుండగా ఈ ఆలయాన్ని వ్యవస్థాపక ట్రస్టీలు సరిగ్గా నిర్వహించడం లేదని, సామాన్య భక్తులకు స్వామి పూజలు అందడం లేదని, అంతా ధనికులకే సేవలు అందుతున్నాయంటూ పలువురు దేవదాయ శాఖకు ఫిర్యాదు చేశారు. అనేక ఆరోపణలు ఉన్న నేపథ్యంలో మరోసారి సెక్షన్ 29 ప్రకారం మినహాయింపు ఇచ్చి, నిర్వహణ బాధ్యతలు ఇవ్వలేమని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తేల్చి చెప్పేశారు. దాంతో వెంటనే కమిషనర్ అసిస్టెంట్ కమిషనర్ శిరీషను ఈఓగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. బాధ్యతలు అప్పగించడానికి ముందు ట్రస్టీలు నిరాకరించినా, ఆ తరువాత ఏమనుకున్నారో ఏమో ఆమెకు మొత్తం ఇచ్చేశారు. అయినా మళ్లీ కోర్టును ఆశ్రయించారు. ఈఓను ప్రభుత్వమే నియమించాలని, దేవదాయ శాఖ కాదంటూ మరో కేసు వేశారు.

ఇదీ వాదన

ఏడాదికి రూ.4.5 కోట్లకు పైగా ఆదాయం వస్తున్న ఆలయాలకు ఈఓను నియమించే అధికారం ప్రభుత్వానికే ఉందని, దేవదాయ శాఖ కమిషనర్‌కు లేదని సంపత్ వినాయక ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ టీఆర్ చోళన్ వాదిస్తున్నారు. ప్రభుత్వం జీఓ ఇవ్వాలని, కమిషనర్ ఉత్తర్వులు చెల్లవని అంటున్నారు.

ఇదీ చరిత్ర

ఈ ఆలయాన్ని 1962లో నిర్మించారు. 1971లో కంచి కామకోటి పీఠాధిపతి గణపతి యంత్రాన్ని ప్రతిష్ఠించారు. 1987లో ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. దీనిని 1996లో దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చారు. మొదటి నుంచి ఆలయ నిర్వహణ అంతా వ్యవస్థాపక ట్రస్టీలు చూసుకునేవారు. వారి సొంత నిధులతోనే పూజలు నిర్వహించేవారు. క్రమంగా ఆలయానికి ఆదాయం పెరగడంతో ప్రభుత్వం ఈఓను నియమించింది. దానిని ట్రస్టీలు

... మిగతా 4వ పేజీలో



ఎర్రాజీ జ్యోతి ఖాతాలో మరో పసిడి పతకం

విశాఖపట్నం (స్పోర్ట్స్), మే 20: నెదర్లాండ్‌లో ఆదివారం రాత్రి జరిగిన హ్యారీ స్కల్డింగ్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో నగరానికి చెందిన ఎర్రాజీ జ్యోతి స్వర్ణ పతకం సాధించింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేస్‌ను 13.06 సెకన్లలో పూర్తిచేసి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల హంగేరీలో జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌లోనూ జ్యోతి స్వర్ణ పతకం సాధించింది. కాగా జూన్ 30వ తేదీతో ఒలింపిక్స్ క్వాలిఫైయింగ్ మీట్స్ ముగియనున్న నేపథ్యంలో అప్పటిలోగా జ్యోతి మరో ఐదు మీట్స్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే ఈ నెలలో వరుసగా జరిగిన రెండు అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన నేపథ్యంలో త్వరలో జరగనున్న ఈవెంట్లలోనూ ప్రతిభ కనబరుస్తుందని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావుతోపాటు ఇతర ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.


అదంతా రెడ్ జోన్

- స్ట్రాంగ్ రూమ్‌లకు రెండు కిలోమీటర్లు చుట్టుపక్కల ఎటువంటి డ్రోన్లు ఎగురవేయకూడదు
- సీపీ రవిశంకర్‌అయ్యన్నార్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్ర జ్యోతి): ఈవీఎంలను భద్రపరిచిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌లకు రెండు కిలోమీటర్ల పరిధిని రెడ్‌జోన్‌గా ప్రకటించినట్టు నగర పోలీస్

... మిగతా 4వ పేజీలో

మామిడి విక్రయదారులపై దాడులు



పట్టుకున్న ఇథోపాన్ ప్యాకెట్లు

- మూడు బృందాలు ఏర్పాటు
- జ్ఞానాపురం పండ్ల మార్కెట్‌లో 125 ఇథోపాన్ ప్యాకెట్ల సీజ్
- రసాయనాల వినియోగంపై స్పందించిన జేసీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తనిఖీలు చేస్తున్న అధికారులు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి):

మామిడిని మగ్గబెట్టేందుకు రసాయనాలు వినియోగి స్తున్న వ్యాపారులపై అధికారులు దృష్టిసారించారు. 'మామిడిపై రసాయనాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ రసాయనాలు వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీఏబీ నందాజీ మూడు బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వ హించారు. జ్ఞానాపురంలోని పండ్ల మార్కెట్‌లో నందాజీ ఆధ్వర్యంలోని బృందం నిర్వహించిన తనిఖీల్లో శ్రీదుర్గా పండ్ల దుకాణంలో 30 క్రేట్లలో 125 ఇథోపాన్ ప్యాకెట్లు ఉండడాన్ని గుర్తించారు. ఈ ప్యాకెట్లను సీజ్ చేసిన అధికారులు...మామిడి పండ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా మామిడి వ్యాపారులతో నందాజీ అవగాహన సదస్సును నిర్వహించారు. ఇథలిన్, ఇతర రసాయనాలను వినియోగించకూడదన్నారు. రసాయ నాలు వినియోగించినట్టు తేలితే వ్యాపారులకు భారీ జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందని స్పష్టంచేశారు. పండ్లపై రసాయనాలు వినియోగించినట్టు అనిపిస్తే ఎవరైనా తమకు ఫిర్యాదు (98490 47761, 9773683667, 9566760283, 9912199284) చేయవచ్చునని నందాజీ తెలిపారు. మరో రెండు బృందాలు నగర పరిధిలో పండ్ల వ్యాపారం ఎక్కువగా సాగే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి.

పర్యావరణంపై అవగాహన



సమావేశంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

మహారాణిపేట, మే 20: పర్యావరణ పరిరక్షణకు కాలుష్య నియంత్రణ మం డలి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్టు డీఎస్ఎన్ఎల్‌యూ ఫస్ట్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై సత్యనారాయణ తెలిపారు. మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల సాధనకు అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సందర్భంగా మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖ నగరంలో పోర్టు, స్టీల్‌ప్లాంట్ ఇతర ఫార్మా కంపెనీల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దేశాలను పక్కాగా అమలు చేయాలన్నారు. మానవ హక్కుల కమిషన్ కూడా భాగస్వామ్యమై ఈ మేరకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతు న్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సీతామాణిక్యం, సభ్యులు ఎస్వీ రమణ, పైడి రాజు, ఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ తొలేళ్ల పండగ


పండగలో పాల్గొన్న కేకే రాజు

అక్కయ్యపాలెం, మే 20: గ్రేటర్ 42వ వార్డులో వేంచేసిన పరదేశమ్మ తొలేళ్ళ పండగ మహోత్సవం సోమవారం జరిగింది. ఈసందర్భంగా ఉత్తర నియోజక వర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, ఆళ్ళ శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నక్కవానిపాలెంలో అమ్మవారి పండగ

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు నక్కవానిపాలెంలో వెలసిన ఏడుగుళ్ల అమ్మవారి ఆలయంలో బెజవాడ కనకదుర్గమ్మ అనుపు మహోత్సవం మంగళవారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో, విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. ఆదివారం రాత్రి పీర్లు, సోమవారం రాత్రి తొలేళ్ల వేడుక నిర్వహించారు. గ్రామంలో రామాలయం వద్దనున్న పెద్దింటి వద్ద నుంచి మంగళవారం అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా ఆల యానికి తీసుకువచ్చి పూజలు చేస్తారు. గ్రామం దొడ్డి పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పండగ జరగనుంది.

నేడు రెడ్డికంచరపాలెంలో....

కంచరపాలెం: రెడ్డికంచరపాలెం గ్రామ దేవత దుర్గాలమ్మ అమ్మవారి ప్రధాన పండగను మంగళవారం నిర్వహించనున్నట్టు గ్రామపెద్దలు, శ్రీరామా సేవాసంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తుమ్మడిపాలెం వద్ద గల ఆలయాన్ని దేదీప్యమానంగా విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరణ చేశారు. మంగళవారం అమ్మవారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో గల పుట్టబంగారం గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామమంతా ఘటాలతో భక్తులు ఊరేగింపు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మే 20: నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. శాంతినగర్, సంతోష్‌నగర్, సంజీవయ్య కాలనీ, కైలాసపురం ప్రధాన రహదారి, కస్తూరినగర్, మధుసూదన్‌నగర్, దుర్గా కైలాసనగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

లలితానగర్‌లో నేలకొరిగిన చెట్టు

అక్కయ్యపాలెం, మే 20 : గ్రేటర్ 26వ వార్డు లలితానగర్ సాక్షి లైన్‌లో చెట్టు విరిగి నేలకొరిగింది. ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు చెట్టుకొమ్మ రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. జీవీఎంసీ సిబ్బంది వచ్చి ఈ చెట్టును తొలగించారు.

ఉచితంగా సున్తీ వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, మే 20: పేద ముస్లిం పిల్లలకు రైల్వేన్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో శీరత్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత సున్తీ వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఉత్తరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, గౌరవాధ్యక్షుడు హైదరాలి సింకా మాట్లాడుతూ సుమారు 250 మంది కి విజయవాడ నుంచి వచ్చిన వైద్యుడు మౌలాలి ద్వారా ఈ ఉచిత వైద్యశిబిరం చేపట్టారన్నారు.


ఎల్‌ఐసీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న సెంట్రల్ పార్కు ప్రాంగణం


వీధి దీపాలులేక సాయంత్రం వేళలో కటిక చీకటిగా ఉన్న ఫుట్‌పాత్ రహదారి

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

- ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన సెంట్రల్ పార్కు ఆవరణలో దుస్థితి
- చీకటిపడితే వ్యభిచారం, ట్రాన్స్‌జెండర్ల హల్‌చల్
- మద్యం, డ్రగ్స్ సేవనం.. ▸ వీధి దీపాలులేక చెలరేగుతున్న మూకలు
- ప్రశ్నిస్తున్న వారిపై ఎదురుదాడులు

మహారాణిపేట, మే 20: నగరం నడిబొడ్డున ఉన్న ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటిపడితేచాలు వ్యభిచారం, ట్రాన్స్‌జెండర్స్ అలజడి, పలువురు మద్యం, డ్రగ్స్ సేవనం తదితర విచ్చలవిడి పనులకు పాల్పడుతుండడంతో ఈ మార్గం గుండా వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంటోంది. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఎల్ఐసీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న సెంట్రల్ పార్కు వెలుపల ప్రాంగణంలో ఈ పరిస్థితి నెలకొంటోంది. సాయంత్రం ఆరు తరువాత ట్రాన్స్‌జెండర్లు, వ్యభిచారులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుంటారు. ఆ ప్రాంగణంలో విద్యుత్ లైట్లు లేకపోవడం, చెట్లు ఉండటంతో కటిక చీకటి అలుముకుంటోంది. దీంతో అసాంఘిక పనులకు అడ్డులేకుండా పోతోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి డాబాగార్డెన్స్ వైపునకు వచ్చే పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ట్రాన్స్‌జెండర్స్ అయితే, ఏకంగా వెకిలి చేష్టలతో హడలెత్తిస్తున్నారు. ఇదే ప్రాంతానికి సమీపంలోనే ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు ఈమార్గంలోనే ఆర్టీసీ కాంప్లెక్స్ వెళ్తుంటారు. ఇతర ప్రయాణికులు ఇక్కడి స్టాప్‌లో బస్సుల కోసం నిల్చుంటారు. అసాంఘిక కార్యకలాపాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పనులకు పాల్పడడంతోపాటు తిరిగి అభ్యంతరం వ్యక్తంచేసిన వారిపై దా డులు చేసేందుకు వెనుకాడడంలేదు. గతంలో ఈ ప్రాంతంలో చేతిలో ఉన్న సెల్ ఫోన్లు సైతం పలువురినుంచి లాక్కొని వెళ్లిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇక్కడి జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై అనేకసార్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు వెళ్లాయి. దీంతో ఇక్కడ అక్రమంగా పార్కింగ్ చేస్తున్న వ్యాన్‌లు, ట్యాంకర్స్, మినీ ఆటోలను అక్కడ నుంచి తొలగించి కొంత మేర అడ్డుకట్టవేశారు. తర్వాత పో లీసు బందోబస్తు ఏర్పాటుచేసి తర్వాత పెద్దగా పట్టించుకోవడంలేదు. దీంతో పరిస్థితి యథాతథంగా మారింది. ఈ ప్రాంతంలో ఏదైనా అఘాయిత్యం జరిగితే కానీ పోలీసులు స్పందించరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ దీపాల సమస్యపై సీఐ వినతినీ పట్టించుకోని వైనం

ఈ ప్రాంతంలో చీకటి ఉండటంతో అసాంఘిక పనులకు ఆస్కారం ఉం టుందని భావించి టూటౌన్ పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సీఐ) విద్యుత్ దీ పాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులు, జీవీఎంసీ అధికారులను వినతిపత్రం అందించారు. జీవీఎంసీ పట్టించుకోలేదు. ఇకనైనాస్పందించి ఈప్రాంతంలో విద్యుత్ లైట్లు వేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

బాధితుల వైపు నిలబడితే కేసులు పెడతారా...?

- బర్మా క్యాంప్ దాడి కేసులో నోటీసులు అందజేత అన్యాయం
- నార్త్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజు ఆవేదన


కంచరపాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట నోటీసు చూపుతున్న విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, మే 20 : టీడీపీకి ఓటువేశారనే నెపంతో దాడికి పాల్పడడంతో ఆ బాధితుల పక్షాన నిలబడిన తనపై కేసులుకట్టి అరెస్టు నోటీసులు అందిస్తారా...? అంటూ మాజీ ఎమ్మెల్యే, ఉత్తరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పి. విష్ణుకుమార్ రాజు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం బర్మా క్యాంప్‌లో టీడీపీకు ఓటు వేశారనే నెపంతో సుంకర ధనలక్ష్మి ఆమె కుటుంబ సభ్యులపై లోకేష్ అనే వ్యక్తి దాడి చేసిన విషయంపై తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులు విష్ణుకుమార్‌రాజును స్వయంగా కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. బాధితుల సమక్షంలో విష్ణుకుమార్‌రాజు ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేసి ఈ దుర్ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత గొడవలకు రాజకీయం అంటగడుతున్నారంటూ పోలీసులు కేసునమోదు చేసి ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీంతో సోమవారం విష్ణుకుమార్ రాజు ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్‌తో కలిసి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు హాజరై బెయిల్ పొందారు. అనంతరం విష్ణుకుమార్ మీడియాతో మాట్లాడుతు తీవ్రగాయాలు పాలైన బాధితులు తనవద్దకు వచ్చి జరిగిన ఘటనను వివరిస్తే తాను మాట్లాడానని, ఒక ప్రజాప్రతినిధిగా తనకు ఆ మాత్రం వాక్ స్వాతంత్ర్యం లేదా అని ప్రశ్నించారు. ఏ ఫిర్యాదు లేకున్నా 41ఏ నోటీసులిచ్చి తనపై పలు కేసులు పెట్టారన్నారు. అలాగే బాధితుల గోడును వెలుగులోకి తీసుకువచ్చిన మీడియాపైనా కేసులు పెట్టడం దారుణమన్నారు.

చంద్రబాబు, పవన్‌లపై దాడులపై స్పందనలేదేమీ?

గతంలో విశాఖ వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును ఎయిర్ పోర్టు నుంచి బయటకు రానీయకుండా అడ్డుకుని వాటిల్ బాటిల్స్ విసిరి అసభ్యకరంగా మాట్లాడిన వారిపై ఎందుకు కేసులు కట్టలేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోవాటెల్ నుంచి పోర్టు స్టేడియంకు బయలుదేరకుండా అడ్డుకున్నప్పుడు సుమోటాలు పోలీసులకు గుర్తుకురాలేదా అని వాపోయారు. ప్రజలకు భంగం కలిగించడం తన ఉద్దేశం కాదని, చట్టాన్ని గౌరవించే సంస్కారం తనకు ఉందన్నారు. పోలీసుల తీరుతో ఇకపై అన్యాయానికి గురైన బాధితుల తరపు నుంచి మీడియాలో వెలుగులోకి తీసుకురావడం, వారి తరపున ప్రజా ప్రతినిధులు మాట్లాడం అన్యాయమైతే.. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సనపల వరప్రసాద్, కుట్టా కార్తీక్, బీజేపీ నాయకుడు రంగు ముద్ర రాంబాబు ఉన్నారు.

వైసీపీకి ఓటు వేయనందుకే దాడి చేశారు

- బర్మా క్యాంపు బాధిత కుటుంబం ఆరోపణ
- తమకు రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌కు...
- పోలీస్ కమిషనర్‌ను కలవాల్సిందిగా సూచించిన జేసీ


కలెక్టరేట్ ఎదుట బర్మా క్యాంప్ బాధిత కుటుంబం

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి కాకుండా టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేశామనే కక్షతో తమపై కొందరు మారణాయుధాలతో దాడి చేసి అంతమొందించేందుకు యత్నించారని బర్మా క్యాంపునకు చెందిన సుంకరి నూకరత్నం ఆరోపించారు. తల్లి ధనలక్ష్మి, సోదరుడు మణికంఠ, సోదరి రమ్యతో కలిసి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె అక్కడ విలేకరులతో మాట్లాడుతూ జీవనోపాధి కోసం ఇంటి వద్ద చిన్న పాన్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా విష్ణుకుమార్‌రాజు ఉన్న సమయంలో పీఎంఏవై పథకం కింద ఇల్లు నిర్మించుకున్నామన్నారు. దానికి సంబంధించి శిలాఫలకం ఇంటిగోడకు ఉంటుందన్నారు. ఈనెల 15వ తేదీ రాత్రి...అంటే పోలింగ్ ముగిసిన రెండు రోజులకు ఆ ప్రాంతానికి చెందిన వైసీపీ మద్దతుదారులు లోకేష్, భూలోక్, సాయి, భాస్కర్, చిన్ని, ఆశ తదితరులు తమ షాపు వద్దకు వచ్చి వైసీపీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో టీడీపీ, బీజేపీలకు ఓటు వేస్తారా?...అంటూ తమతో గొడవకు దిగడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. ఈ క్రమంలో తనతోపాటు ఇంట్లో ఉన్న తల్లి ధనలక్ష్మి, సోదరుడు మణికంఠ, గర్భవతి అయిన సోదరి రమ్యపై కూడా దాడి చేశారన్నారు. వైసీపీకి ఓటు వేయనందుకే కక్షగట్టి దాడులు చేశారని, అయితే వ్యక్తిగత వివాదంగా పోలీసులు కేసు కట్టారని నూకరత్నం ఆరోపించారు. ఈ వ్యవహారంపై తమ కుటుంబానికి రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జేసీ మయూర్ అశోక్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వగా, సీపీని కలవాలని సూచించారు.

చిన్నారులకు ఫుట్‌బాల్ కిట్లు పంపిణీ


శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 20: ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ ఆటగాడు దివంగత పి.కొండలరావు వర్ధంతి సందర్భంగా ఫుట్‌బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు సోమవారం ఫుట్‌బాల్ కిట్స్ పంపిణీ జరిగింది. నగరంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో స్టార్ ఫ్లెక్స్ స్పోర్టింగ్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాధికార సంస్థ క్రీడాభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సుస్మిత ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు ఫుట్‌బాల్ షూస్, జెర్సీ, బాల్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో మాట్లాడుతూ చిన్నారి ఫుట్‌బాలర్లను ప్రోత్సహించేందుకు శిబిరాల నిర్వహణతోపాటు విశాఖ ఫుట్‌బాల్ రంగానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చిన కొండలరావు జ్ఞాపకార్థం కిట్స్ పంపిణీ చేపట్టిన స్టార్ ఫ్లెక్స్ స్పోర్టింగ్ ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శిబిరాల చీఫ్ కోచ్, జాతీయ మాజీ ఫుట్‌బాలర్ శేషుమోహన్ (బుజ్జి), రామకృష్ణ, అశోక్, త్రినాధరావు (బాబు), సన్నీ పాల్గొన్నారు.

'విస్కో'లో అక్రమాలపై విచారణ జరపాలి

- సీపీఎం ఫ్లోర్‌లీడర్ గంగారావు డిమాండ్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇండస్ట్రియల్ వాటర్ సప్లై కార్పొరేషన్ (విస్కో)లో జరుగుతున్న అక్రమాలపై తక్షణం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు లేఖ రాశారు. విస్కో నిధుల దుర్వినియోగంతోపాటు, ఓ ఐఏఎస్ అధికారికి చెందిన భవనాన్ని జీవీఎంసీకి గెస్ట్‌హౌస్ పేరుతో నెలకు రూ.20 లక్షలు అద్దె చెల్లింపే, విస్కో నిధులతో వాహనాలు కొనుగోలు, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు డిమాండ్ తదితర అంశాలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నాయన్నారు. విస్కోలో ఓ తాత్కాలిక ఉద్యోగి అవినీతికిపాల్పడుతున్నట్టు ఆరోపణలపైనా విచారణ జరిపి, నివేదికను జీవీఎంసీ కౌన్సిల్‌లో చర్చకు పెట్టాలని కోరారు. ముడసర్లోవలో నూతనంగా నిర్మించతలపెట్టిన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో విస్కోకి 50 శాతం భాగస్వామ్యం కల్పించారన్నారు. జీవీఎంసీ ఆస్తులను చట్టవిరుద్ధంగా విస్కోకి బదలాయించి, అక్కడ ప్రైవేటు వ్యక్తుల ఆజమాయిషీ ద్వారా వ్యాపార లావాదేవీలు చేసుకునే కుట్ర ఉందని గంగారావు ఆ లేఖలో పేర్కొన్నారు. వీటన్నింటిపైనా సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని కోరారు.

'డ్రా ద్వారానే పండ్ల దుకాణాలు కేటాయింపు'

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో పండ్ల దుకాణాలను డ్రా తీసే కేటాయించినట్టు జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎవరి జోక్యంలేదన్నారు. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్ఓ, ఉద్యాన శాఖాధికారి ఇచ్చిన ధ్రువీకరణల ఆధారంగానే దుకాణాలు కేటాయించామని వివరించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


డాబాగార్డెన్స్, మే 20: జ్యోతిషం, సోషల్ సర్వీసెస్‌లలో ప్రతిభ చూపిన విజయనగరం జిల్లాకు చెందిన డా.పిచ్చుక సత్యశ్రీనివాస్‌కు భారత గౌరవ రత్న అవార్డు వరించింది. ఈ నేపథ్యంలో లాయర్స్ పోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్ జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆయననుసత్కరించారు. ప్రముఖ న్యాయవాది అరుణకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యశ్రీనివాస్ పార్లమెంటరీ చైర్మన్, గోవా మాజీ సీఎం మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. లాయర్స్ ఫోరంఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్రఅధ్యక్షుడు గుడుపల్లి సుబ్బారావు, జోసుబాబు, మూర్తి, బంగారి పాల్గొన్నారు.

అదంతా రెడ్ జోన్

... 3వ పేజీ తరువాయి

కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గంతో పాటు ఆ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఏయూలో భద్రపరిచిన విషయం తెలిసిందే. స్ట్రాంగ్‌రూమ్‌లకు రెండు కిలోమీటర్ల పరిధిని నోఫ్లయింగ్‌జోన్‌గా పరిగణిస్తున్నందున ఆ ప్రాంతంలో ఎలాంటి డ్రోన్లు, బెలూన్లు ఎగరవేయడానికి వీల్లేదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో అభిమానులు

డాబాగార్డెన్స్, మే 20: జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ సిటీవైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్య క్ర మం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ స్టేట్‌వైడ్ కన్వీనర్ నొడగలనాయుడు, జి.ధనరాజ్, తాడి ప్రసాద్, నీల అప్పన్న, నాగిరెడ్డి, దాసు, వరలక్ష్మి, ఎన్.రాజు, పి.ప్రసాద్, ఎన్. ధర్మ, సీహెచ్ అప్పారావు, బి. వాసు, పి. కొండలరావు పాల్గొన్నారు.

'అధ్యాపకురాలిపై వీసీ కక్ష సాధింపు చర్యలు తగవు'

మహారాణిపేట, మే 20: బీసీ వర్గానికి చెందిన విద్యావేత్త, అధ్యాపకురాలు డాక్టర్ లావణ్య దేవిని రాజకీయ కక్షతో ఏయూ వీసీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు సతీమణి అయిన డాక్టర్ లావణ్య దేవి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారనే అనే నేపంతో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి ఆమెను సస్పెండ్ చేశారని, ఈ చర్యను ఖండిస్తున్నామన్నారు. హిందూ ధర్మం ప్రకారం తన భర్త శాసన సభ్యుడిగా పోటీ చేస్తుంటే భార్యగా కనీస ధర్మం పాటించడం తప్పా అని ప్రశ్నించారు. వైసీపీ కండువా కప్పుకున్న కార్యకర్తగా వీసీ ప్రసాదరెడ్డి ప్రవర్తిస్తున్నారని ఆయన ఆరోపించారు.

కిటకిటలాడిన ప్రాంతీయ కంటి ఆసుపత్రి

- ఓపీకి 600పైగా రాక .. ఐదేళ్ల తర్వాత అత్యధికంగా నమోదు


ఆసుపత్రిలో వైద్యం కోసం వేచి ఉన్న జనం

సీతంపేట, మే 20: రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్ ఎదురుగా గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి సోమవారం వైద్యం కోసం వచ్చిన జనంతో కిటకిటలాడింది. గత ఐదేళ్లుగా ఏ రోజు లేని విధంగా వందల సంఖ్యలో రోగులు విచ్చేసి వైద్య పరీక్షల కోసం నిరీక్షించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో దూర ప్రాంతాల నుంచి సైతం ప్రజలు సైతం కంటి వైద్య పరీక్షల కోసం వచ్చారు. కరోనా ముందు ఈ విధంగా ఈ ఆసుపత్రికి అధిక సంఖ్యలో విచ్చేసేవారు. ఈ ఐదేళ్లలో ఈరోజే ఇంత పెద్ద మొత్తంలో 600కు పైగా జనం రావడంపై ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది విస్మయం వ్యక్తంచేస్తున్నారు. అయితే, ఆసుపత్రికి వచ్చిన వారందరికీ నేత్ర వైద్యశాల సూపరెంటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో వైద్యులు వైద్య పరీక్షలు పూర్తి స్థాయిలో అందించారు. అయితే, రోగులు ఒక్కో గది వద్ద వైద్య పరీక్షల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో పలువురు అసహనం వ్యక్తంచేశారు.

ఓటెత్తిన గ్రామీణం

... 3వ పేజీ తరువాయి

ఓటర్లు నగర పరిధి (మధురవాడ, కొమ్మాది, సాగర్‌నగర్, ఎండాడ)లో ఉండగా మిగిలిన వారంతా మూడు మండలాల్లో ఉన్నారు. ఈ సెగ్మెంట్‌లో అత్యధికంగా పద్మనాభం మండలం లింగన్నపేటలో బూత్ నంబరు 13లో 96.83 శాతం ఓట్లు పోలవ్వగా తక్కువగా ఐఎన్ఎస్ కళింగలో ఉన్న ఉద్యోగులు, అధికారుల కోసం నేరేళ్లవలసలో ఏర్పాటుచేసిన బూత్ నంబరు 189లో 98 మంది ఓటర్లకు (60 మంది పురుషులు, 38 మంది మహిళలు)గాను 43 మంది (24 మంది పురుషులు, 19మంది మహిళలు) ఓటు వేశారు. ఓటింగ్ శాతం 43.88 శాతం జరిగింది. నియోజక వర్గంలో 90 శాతం, అంతకంటే ఎక్కువ ఓటింగ్ 50 కేంద్రాల్లో జరిగింది.

విశాఖ తూర్పులో..

విశాఖ తూర్పు నియోజకవర్గంలో 68.64 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 2,92,206 మంది ఓటర్లు ఉండగా 293 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. అత్యధికంగా తోటగరువు బీఎస్ఆర్ నగర్‌లో బూత్ నంబరు-70లో 1,525 మందికి 1,231 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అతి తక్కువగా ఎంవీపీ కాలనీ సెక్టార్-5లో బూత్ నంబరు-114లో 287 మంది ఓటర్లకు 184 మంది ఓటు వేశారు.

విశాఖ దక్షిణలో

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 2,16,770 మంది ఓటర్లు ఉండగా 237 బూత్‌లు ఏర్పాటుచేయగా 1,37,474 మంది (63.43 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. అతి తక్కువ ఓట్లు పోలైన నియోజక వర్గాల్లో రాష్ట్రంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం రెండో స్థానంలో నిలిచింది. వైర్‌లెస్ కాలనీ బూత్ నంబరు 55లో కేవలం 34 ఓట్లు మాత్రమే ఉండగా 23 (67.64 శాతం) ఓట్లు పోలయ్యాయి.

ఉత్తరంలో

ఉత్తర నియోజకవర్గంలో 2,85,789 మంది ఓటర్లకు 275 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. వీరిలో 1,84,703 మంది (64.63 శాతం) ఓటు వేశారు. అత్యధికంగా సత్యానగర్‌లో 980 మందికి 822 మంది (84 శాతం) ఓటు హక్కు వినియోగించుకోగా, తక్కువగా నరసింహనగర్ బూత్ నంబరు 124లో 1,163 మందికి 490 (42 శాతం) మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విశాఖ పశ్చిమలో

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 222 పోలింగ్ బూత్‌లలో 2,13,439 మంది ఓటర్లకుగాను 1,48,942 మంది (69.78శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 50 శాతం కంటే తక్కువ పోలింగ్ ఏడుచోట్ల నమోదైంది. అత్యధికంగా గోపాలపట్నం ఇంద్రానగర్ బూత్ నంబరు 13లో 88.55, గవర కంచరపాలెం బూత్ నంబరు 191లో 88.2 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తక్కువగా ఐఎన్ఎస్ డేగాలో పనిచేసే ఉద్యోగులు ఉండే విమాననగర్‌లో కేవలం 7.74 శాతం మంది ఓట్లు వేశారు. విమాననగర్ కోసం ఏర్పాటుచేసిన బూత్ నంబరు 213లో 620 మంది ఓటర్లు ఉండగా కేవలం 48 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గాజువాకలో..

రాష్ట్రంలో ఎక్కువగా ఓటర్లు ఉన్న నియోజకవర్గాల్లో భీమిలి తరువాత స్థానం గాజువాకదే. గాజువాకలో 3,33,661 మంది ఓటర్లు ఉండగా 2,32,949 (69.83 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా బూత్ నంబరు 190లో 937 మందికి 814 మంది (86.87 శాతం) ఓటు వేయగా, తక్కువగా బూత్ నంబర్ 46లో 705 మందికి 322 మంది (45.67 శాతం) ఓటు వేశారు.

ఎస్.కోటలో

ఎస్.కోటలో 2,22,475 మందికి 1,90,104 మంది ఓటు హక్కు (85.45 శాతం) వినియోగించుకున్నారు. అత్యధికంగా లింగంపేటలో 787 మందికి 751 మంది (95.43 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. దాదాపు 220 బూత్‌లలో 80 నుంచి 95 శాతం వరకు ఓట్లు పోలయ్యాయి. అతి తక్కువగా ఎస్.కోట బూత్ నంబరు 19లో 803 మందికి 433 మంది (53.92 శాతం) ఓటు వేశారు.

ఆలయ నిర్వహణపై వివాదం

... 3వ పేజీ తరువాయి

ఇబ్బందిగా భావించి ప్రభుత్వ పెద్దలను పట్టుకొని సెక్షన్ 29 కింద మినహాయింపు తెచ్చుకున్నారు. ఐదేళ్లపాటు వారే నిర్వహించుకునేలా ఆదేశాలు తెప్పించుకున్నారు. గత ఏడాది అది ముగిసిపోవడంతో మరో ప్రయత్నం చేసి విఫలమయ్యారు.

ఇవీ ఫిర్యాదులు, ఆరోపణలు

- ఆలయంలో వాహన పూజలు చేయించుకునే వారి వద్ద డబ్బులు తీసుకొని రశీదులు ఇవ్వడం లేదు.
- అభిషేకాలు, సేవల కోసం అర్చకులు భక్తుల నుంచి పెద్ద మొత్తాలు వసూలు చేస్తున్నారు.
- రెగ్యులర్‌గా హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తూ సామాన్య భక్తులను అనుమతించడం లేదు.
- ధనికులు, వీవీఐపీలకు మాత్రమే ప్రత్యేక పూజలు చేస్తూ వారి నుంచి భారీగా విరాళాలు పొందుతున్నారు.
- ఆలయ నిర్వహణలో సంబంధం లేని వ్యక్తులు పాల్గొంటూ భక్తులను ఇబ్బంది పెడుతున్నారు.
- ఆలయ ఉద్యోగులను వ్యక్తిగత పనులకు ఉపయోగించుకుంటున్నారు.
- అన్నదానం రోజూ చేయాల్సి ఉండగా నచ్చినప్పుడే పెడుతున్నారు. టోకెన్ల జారీలో పారదర్శకత లేదు.
- అర్చకుల వసూళ్లు, పెత్తనం పెరిగిపోయింది. దానిని వ్యవస్థాపక ట్రస్టీలు నియంత్రించలేకపోతున్నారు. ...ఇలా అనేక ఫిర్యాదులు, ఆరోపణలు అందడంతో, వీటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. నెల రోజుల్లో నివేదిక సమర్పించాల్సి ఉంది.

డెంగ్యూ బెల్స్

... 3వ పేజీ తరువాయి

నెల మధ్యనాటికే 146 డెంగ్యూ కేసులు నమోదైతే, జూన్ నాటికి డెంగ్యూ విశ్వరూపం చూడాల్సి ఉంటుందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటినుంచే దీనిపై దృష్టిసారించకపోతే రికార్డు స్థాయిలో కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. అందువల్లే నెల రోజులు ముందుగానే దోమల నియంత్రణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్ ప్రారంభించారు. ప్రతిరోజూ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి దోమల లార్వాలను గుర్తించి నిర్వీర్యం చేసే పనికి శ్రీకారం చుట్టారని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వివరించారు. డెంగ్యూ తీవ్రత గత ఏడాదితో పోల్చితే తక్కువగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. జిల్లా మలేరియా విభాగం ఇచ్చే నివేదికలో డెంగ్యూ కేసులు ఉన్నట్టు చెబుతుంటే, జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం మాత్రం అలాంటి కేసులు లేవని చెప్పడం గురించి ప్రశ్నించగా...క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నరేష్‌కుమార్ అన్నారు.

శిథిలావస్థకు చేరిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్

నిర్వహణ లోపమే ప్రధాన కారణం

దళితులకు ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ ఆశయానికి తూట్లు

మొత్తం 13 షాపుల్లో పాడైపోయినవి 4, నిజమైన లబ్ధిదారులు ఉన్నవి 3

మిగిలిన 6 షాపుల్లో బినామీల ఆధిపత్యం

పట్టించుకోని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు



బీహెచ్‌పీవీ కూడలిలోని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్



అక్కిరెడ్డిపాలెం, మే 20: విద్యావంతులైన దళిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉన్నత ఆశయంతో లక్షల రూపాయల వ్యయంతో జాతీయ రహదారికి ఆనుకుని బీహెచ్‌పీవీ జంక్షన్ వద్ద ప్రభుత్వం నిర్మించిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి అధికారుల అలసత్వం తోడవ్వడంతో ఎంతో వ్యయంతో నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్ ఇప్పుడు ప్రభుత్వ ఆశయానికి గండి కొడుతూ బినామీలకు ఆదాయ వనరుగా మారింది. వివరాల్లోకి వెళితే..

బీహెచ్‌పీవీ కూడలి వద్ద 1982లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో సెట్విస్, ఎస్సీ కార్పొరేషన్ భారీ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించింది. పదమూడు దుకాణాల సముదాయంతో నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్ అప్పట్లో ఈ ప్రాంత అభివృద్ధికి నాంది పలికిందని చెప్పవచ్చు. ఈ షాపులను విద్యావంతులైన నిరుద్యోగ దళిత యువకులకు కేటాయించడంతో వారు ఎంతో ఆనందంతో రుణాలు తీసుకుని పలు వ్యాపారాలను ప్రారంభించారు.

కొన్నేళ్ల పాటు ఎంతో ప్రోత్సాహకరంగా వీరి వ్యాపారాలు సాగినప్పటికీ కాలక్రమేణ చుట్టుపక్కల పలు వాణిజ్య, వ్యాపార సముదాయాలు రావడంతో వీరి వ్యాపారాలు ఆశాజనకంగా సాగలేదు. దీనికితోడు ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ లోపం వల్ల సమీపంలోని కాలువలు పాడవ్వడంతో పాటు రహదారులు గోతులమయంగా మారాయి. కాగా షాపింగ్ కాంప్లెక్స్‌పై ఓసీఆర్‌సీడీ అనే స్వచ్ఛంద సంస్థ ఓ అంతస్థు నిర్మించి అందులో కొంతకాలం పాటు కంటి ఆస్పత్రిని నిర్వహించి మూసివేసింది. అనంతర కాలంలో పై అంతస్థుతో పాటు కింద వున్న పలు షాపులు శిథిలావస్థకు చేరాయి.

ప్రస్తుతం ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో నాలుగు షాపులు మూతపడగా, ముగ్గురు మాత్రమే నిజమైన దళిత లబ్ధిదారులు షాపులను నిర్వహిస్తున్నారు. మిగతా షాపులు బినామీల ఆధీనంలో ఉన్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలంలో శిథిలమైన ఈ షాపింగ్ కాంప్లెక్స్ కూలిపోయే ప్రమాదం ఉందని పలువురు వ్యాపారులు భయాందోళన చెందుతున్నారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఏనాడు ఈ షాపింగ్ కాంప్లెక్స్ వైపు కన్నెత్తి కూడా చూడలేదని, ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా పాడైపోయిన ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను రాత్రిపూట కొంతమంది ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. ఎంతో విలువైన ఈ కాంప్లెక్స్ స్థలంపై కొంతమంది నాయకుల కన్ను పడడంతో కబ్జా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి ఈ షాపింగ్ కాంప్లెక్స్ ఆక్రమణలకు గురి కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధునాతనంగా నిర్మించాలి



ఎంతో వ్యయంతో, ఉన్నత ఆశయంతో నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిజమైన నిరుద్యోగ దళిత యువకులకు ఉపాధి చూపకపోగా బినామీల పరం కావడం విచారకరం. ఇకనైనా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు శిథిలమైన ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి, అధునాత నమైన కాంప్లెక్స్‌ను నిర్మించి దళిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలి.

-పెట్ల వెంకట రమణ, తుంగ్లాం



అమ్మవారి ప్రతిమలు, ఘటాల ఊరేగింపులో పాల్గొన్న గణబాబు, తదితరులు

ఘనంగా పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం

గోపాలపట్నం, మే 20: ఇక్కడి ప్రశాంతినగర్‌లో కొలువుదీరిన పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం నుంచి ఉత్సవ ప్రతిమలు, ఘటాలను మేళతాళాలు, గారడీ విన్యాసం, తప్పెటగుళ్లు, కోలాటం, పులివేషాలు, తదితర సంప్రదాయ నృత్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ప్రతిమను తలపై పెట్టుకుని పశ్చిమ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్త పి.గణబాబు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. కాగా సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం పైడితల్లమ్మను దర్శించేందుకు భక్తులను అనుమతిస్తారు. అమ్మవారి ప్రధాన పండుగ దృష్ట్యా మంగళవారం వేకువజాము నుంచే అమ్మవారి దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు క్యూ లైన్లలో నిల్చొనేందుకు వీలుగా బారికేడ్లు, పెండాల్స్‌ను సిద్ధం చేశారు.

వైసీపీ ప్రభుత్వంపై జనాగ్రహం

జూన్ 9న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 20: భీమిలి నియోజకవర్గంలో సాధించనున్న భారీ మెజారిటీకి కారణమైన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, నియోజకవర్గం కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు.ఎన్నికలో పనిచేసిన ఇన్‌చార్జిలు, నాయకులు, శ్రేయోభిలాషులతో వాల్తేర్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కోసం ఎంతో అభిమానంతో పనిచేసిన ఎన్నికల టీం ఉండడం తన అదృష్టమన్నారు. కుటుంబ సభ్యుడు పోటీ చేస్తే ఎంత కష్టపడి పనిచేస్తారో అంత కంటే ఎక్కువగా పనిచేశారన్నారు. జగన్ దుర్మార్గపు పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, జూన్ 4న ఎన్నికల ఫలితాల రూపంలో అది కనిపించబోతుందని చెప్పారు. జగన్‌ను గద్దెదింపడానికి అన్ని వర్గాల ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వెల్లువెత్తారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, జూన్ 9న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు. భీమిలి నుంచి పోటీ చేయడానికి నాలుగున్నరేళ్లు కష్టపడి పార్టీని నడిపించిన కోరాడ రాజబాబు ఎన్నికల సమయంలో ముందుండి పని చేశారని ప్రశంసించారు. భీమిలి నుంచి జనసేన తరపున పోటీ చేయాలని పంచకర్ల సందీప్ ఆశించి నప్పటికీ పూర్తి సహకారం అందించారని చెప్పారు. బీజేపీ ఇన్‌చార్జి రామునాయుడు నిరంతరం తన వెంటే ఉండి మిత్రపక్ష స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. అనంతరం భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, వార్డుల ఇన్‌చార్జిలను గంటా సన్మానించారు.

సమాజ సేవే జూ.ఎన్టీఆర్ అభిమానుల లక్ష్యం

ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ



దివ్యాంగుల ఆశ్రమంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించిన దృశ్యం

కూర్మన్నపాలెం, మే 20: సమాజ సేవే లక్ష్యంగా ప్రముఖ హీరో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ముందుకు సాగుతుండడం అభినందనీయమనీ జూ.ఎన్టీఆర్ రాష్ట్ర ఫ్యాన్స్ కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలో టీమ్ తారక్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జూ.ఎన్టీఆర్ జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్టీఆర్ అభిమానులు పలు అభిమాన సంఘాలకు ఆదర్శంగా ఉంటారన్నారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడంతో పాటు దివ్యాంగుల ఆశ్రమంలో కేకు కటింగ్ చేసి వారికి భోజన ఏర్పాట్లు చేశారు. కూర్మన్నపాలెం నుంచి అచ్యుతాపురం వరకూ రహదారుల ఉన్న వృద్ధులకు ఆహార పొట్లాలు పంపిణీ చేసారు. రెండు పేద కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు శ్రీను, గణపతి, రాము, ఆనంద్, రమణ, వేగుంట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా లేకపోవడంతో మహిళల నిరసన

అక్కిరెడ్డిపాలెం, మే 20: పారిశ్రామిక ప్రాంతంలో మంచినీటి కోసం మహిళల నిరసనలు ప్రారంభమయ్యాయి. అక్కిరెడ్డిపాలెంలోని రైల్వే ట్రాక్‌పై నివసిస్తున్న వారిళ్లకు గత నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో స్థానిక మహిళలు సోమవారం ఆందోళన చేపట్టారు. నాలుగు రోజులుగా నీటి కోసం తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ పలువురు మహిళలు ఖాళీ బిందెలతో హైస్కూల్ గ్రౌండ్‌లో వున్న వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది సంబంధిత అధికారులకు తెలియజేశారు. వారి సూచన మేరకు రైల్వే ట్రాక్‌పై ఉన్న ఇళ్లకు మంచినీటిని విడుదల చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, మే 20: అప్పన్నపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్‌లో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్న కారణంగా మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా గౌతమ్‌నగర్,వేపగుంట జంక్షన్, కృష్ణానగర్, నాయుడుతోట పరిసర ప్రాంతాలక విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

3 రోజుల్లో 112 కిలోల చందనం అరగదీత

సింహాచలం, మే 20 : సింహాద్రినాథునికి ఈనెల 23న రెండో విడత చందనం సమర్పణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ఈనెల 18న ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది 40 కిలోలు, 19న 37 కిలోలు చందనం అరగదీయగా సోమవారం మరో 35 కిలోలు చందనం అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చంద నపు ముద్దను ఆలయ ఏఈఓ ఆనందకుమార్, స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి పద్మనిధిలో భద్రపరిచారు.



ఉభయదేవేరులతో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పెందుర్తి, మే 20: స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఐదు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవంలో ఆఖరి ఘట్టమైన వేంకటేశ్వరస్వామికి శ్రీచక్రస్నానం చేశారు. సుగంధ ద్రవ్యాలతో కూడిన పవిత్ర జలాలతో శ్రీవారికి తపనం నిర్వహించారు. అనంతరం ఆ పవిత్ర జలాలను భక్తుల శిరస్సులపై అర్చకులు చల్లారు ఆ తర్వాత స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పుష్పార్చన, ఊంజల సేవ జరిపారు. వివిధ రకాల ప్రసాదాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో హోమాలకు పూర్ణాహుతి చేశారు.

దివ్యాంగులు బడి బాట పట్టేలా..

కూర్మన్నపాలెం, మే 20: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితిలో వడ్లపూడి భవిత కేంద్రం ఉపాధ్యాయులు సోమవారం దివ్యాంగుల ఇళ్ల నమోదుపై సర్వే నిర్వహించారు. చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించే ప్రక్రియలో భాగంగా వారిళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. చదువుకొనడం వల్ల లాభాలు, సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి, అందిస్తున్న రాయితీలు, సదుపాయాలను వారి తల్లిదండ్రులకు వివరించారు. దివ్యాంగ విద్యార్థులు విధిగా బడిబాట పట్టేందుకు వారు తగిన సూచనలు ఇచ్చారు. భవిత పాఠశాలల్లో చేర్పిస్తే దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల మంజూరు, ప్రతినెలా రూ.300 చొప్పున రవాణా భత్యం, వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లను అందజేస్తారని, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం కింద ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.11 వేల అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే బస్సులు, రైళ్లల్లో ప్రయాణానికి ఉచిత పాస్ సదుపాయాలు, పాఠశాలకు రాలేని విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులే వెళ్లి బోధించడం జరుగుతుందని వివరించారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినిపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 27, టమాటా 28, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 32, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 160, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 35, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	138
ఫారం ధర	--	158
విత్ స్కిన్	--	286
స్కిన్‌లెస్	--	296

ఉక్కు ఉద్యోగులకు ఏప్రిల్ నెల జీతాలు ఎప్పుడిస్తారు?

పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు



దీక్షా శిబిరంలో నాయకులు

కూర్మన్నపాలెం, మే 20: స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఏప్రిల్ నెలకు సంబంధించిన జీతాలను ఎప్పుడు చెల్లిస్తారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్న పాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,194వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో సుమారు రూ.2,500 కోట్ల ఉక్కు విక్రయాలు జరిగాయన్నారు. కేవలం రూ.45 కోట్లు మాత్రమే ఉక్కు కార్మికులకు జీతాలు అవుతాయని, వీటిని మే 20వ తేదీ వచ్చినా చెల్లించకపోవడం దారుణమని మండిపడ్డారు. అసలు కార్మికులకు జీతాలు చెల్లించేందుకు ఉక్కు యాజమాన్యం ఎందుకు ముందుకు రావడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కేవలం రూ.వెయ్యి కోట్ల విక్రయాలు జరిగినప్పుడు కూడా ప్రతినెలా ఒకటో తేదీ నాటికే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు కుట్రపూరితంగా చెల్లించకపోవడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు.కార్మికులంతా ఐకమత్యంతో పోరాడితే విజయం సాధించవచ్చని, ఉక్కు పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా వెనకాడబోమని రామచంద్రరావు స్పష్టం చేశారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగంలోనే ఉంచుతామని ప్రకటించేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం

జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి రాధారత్నం



శిబిరంలో పాల్గొన్న న్యాయాధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు రాధారత్నం

విశాఖపట్నం (లీగల్), మే 20 : న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంతో పాటు సత్వర న్యాయానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు కె. రాధారత్నం అన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ, ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా నూతన కోర్టుల కాన్ఫరెన్సు హాలులో న్యాయాధికారుల ఐదు రోజుల శిక్షణా శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన మెళుకువలను న్యాయాధికారులు తెలుసుకొని కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వివాహ సంబంధ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ జాతీయ శిక్షకులు వీకే బన్సల్, సునీల్ కుమార్ అగర్వాల్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 29 మంది న్యాయాధికారులు, పలువురు న్యాయమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే వైసీపీ దాడులకు తెగబడుతోందని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీకి ఓట్లేశారని దాడులకు తెగబడడం దారుణమన్నారు. బాధితులకు అండగా నిలిచిన 'ఉత్తర' కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుపైనా కేసులు పెట్టడం విచారకరమన్నారు. కవర్ చేసిన మీడియాపైనా కేసులు పెట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అలాగైతే తప్పుడు రాతలు రాసిన వైసీపీ పత్రికపై ఎన్ని కేసులు పెట్టారని పల్లా ప్రశ్నించారు. ఎన్నికలు రోజు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుధాకర్‌పై ఎమ్మెల్యే శివకుమార్ దాడి చేశారని, కానీ సాక్షి పత్రిక ఎమ్మెల్యేపై ఓటరు దాడి చేశారంటూ తప్పుడు వార్త రాసిందన్నారు. మరి సాక్షి పేపర్‌పై పోలీసులు ఎందుకు కేసు పెట్టలేదన్నారు. విశాఖ ఘటనలో తొమ్మిది మంది దాడి చేస్తే కేవలం ఒకరినే అరెస్టు చేసి, మిగతా వారిని ఎందుకు వదిలేశాన్నారు. బాధితుల పక్షాన తాము ఉండకూడదా?.. ఆయన అని ప్రశ్నించారు.ఏయూలో అసిస్టెంట్‌ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తన భార్య లావణ్యను ఐదేళ్లుగా వేధింపులకు గురి చేస్తున్నారని పల్లా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. లావణ్య ఎన్నికల ప్రచారం చేశారని నోటీసు ఇచ్చారని, ఆమెకు రావాల్సిన ప్రమోషన్‌ను ఆపేశారని, సస్పెన్షన్‌పై న్యాయ పోరాటం చేస్తుందన్నారు. ఏయూను వైసీపీ కార్యాలయంగా వీసీ ప్రసాద్‌రెడ్డి మార్చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో వీసీ ప్రైవేటు కాలేజీ కరస్పాండెండ్లతో తో సమావేశం పెట్టారని, అయినా ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోలేదన్నారు.

వివాహిత ఆత్మహత్య



కమల మృతదేహం

గోపాలపట్నం, మే 20: అనారోగ్య సమస్యల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన 89వ వార్డు పరిధి సంతోశ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంతల మోహనరావు అనే రైల్వే ఉద్యోగి భార్య పైడమ్మ (కమల), నలుగురు పిల్లలతో కలిసి కొత్తపాలెంలోని సంతోశ్‌నగర్ కాలనీలో నివసిస్తున్నారు. ఈ నెల 18న మోహనరావు తమ కుమారుడితో కలిసి తిరుపతి వెళ్లారు. ఆదివారం రాత్రి భోజనాలు చేశాక కమల ఒంటరిగా ఇంట్లో నిద్రించగా, ముగ్గురు పిల్లలు మేడపై పడుకున్నారు. అయితే సోమవారం ఉదయం పిల్లలు కిందకు వచ్చి చూసేసరికి తల్లి వంట గదిలోని ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరి వేసుకుని ఉండడం చూసి స్థానికులకు తెలిపారు. వారు వచ్చి చూసేసరికే ఆమె మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి, ఘటనపై ఆరా తీశారు. కమల అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబీకులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు

పెదగంట్యాడ, మే 20: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం పెదగంట్యాడ శాఖా గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి వేసవి శిక్షణ శిబిరం ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని గ్రంథాలయాధికారి వీవీ రమణ పేర్కొన్నారు.

యువతకు సనాతన ధర్మాల గురించి తెలియాలి

కూర్మన్నపాలెం, మే 20: నేటి యువతకు సనాతన ధర్మాలు-భక్తి భావనల గురించి విధిగా నేర్పిస్తే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. 87వ వార్డు పరిధి కణితి గవరవీధి రామాలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి వేదర్ష అన్నమయ్య సంకీర్తనా శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వెంకటాద్రి కొండపై కొలువుదీరిన శ్రీవారి సంకీర్తనలతో ముక్తిని పొందిన తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు ఆనందభూతిని అందిస్తాయన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరూ అన్నమాచార్యుల సంకీర్తనలను నేర్చుకోవాలన్నారు. కాపారపు ఫౌండేషన్, గీతాచార్య భక్తి గీతాంజలి, గౌరీ సేవా సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో శివున్నాయుడు, సత్యనారాయణ, సత్యప్రసాద్ శర్మ, సత్యం పాల్గొన్నారు.



శిష్యులతో నడిచి వస్తున్న లక్ష్మీకాంత్ నాయకో దాసుడు

అప్పన్నకు ఒడిశా దాసుడు పూజలు

సింహాచలం, మే 20 : ఒడిశాలోని బరంపురం జిల్లా పట్టుపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు సోమవారం వరాహలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఏటా స్వామివారి నిజరూప దర్శనం చందనోత్సవం తరువాత బంధుమిత్రులు, శిష్య పరివారంతో ఆయన సింహగిరికి వచ్చి మూడు నెలలు పాటు తమ భవనంలో బస చేసి ప్రతిరోజూ స్వామివారిని పూజించడం ఆనవాయితీ. ఈమేరకు ఆయన స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని నూనె భండారం వద్ద ప్రత్యేక దీపారాధనలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కోలుకున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ కోలుకున్నారు. గుండెపోటుకు గురైన ఆయనకు కేర్ ఆస్పత్రిలో పేస్ మేకర్ వేశారు. ఆదివారం సాయంత్రానికి కోలుకున్న ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. రెండు రోజుల్లో విధుల్లో చేరతానని ఆయన తెలిపారు. ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

నేడు బుచ్చిరాజుపాలెంలో దుర్గాలమ్మ పండుగ

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 20: జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెంలోని దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో కొలువుదీరిన దుర్గాలమ్మ ప్రధాన పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా గత వారం రోజుల నుంచి అమ్మవారి ఘటాలను పురవీధుల్లో భక్తులు ఊరేగిస్తున్నారు. అమ్మవారి ప్రధాన పండుగను ఇక్కడ ఉన్న మూడు సామాజిక వర్గాలైన గవర, రెడ్డి, యాదవ కులస్థులు సమష్టిగా గత నలభై ఏళ్లుగా నిర్వహిస్తుండడం విశేషం. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

పర్యావరణంపై అవగాహన



సమావేశంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

మహారాణిపేట, మే 20: పర్యావరణ పరిరక్షణకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్టు డీఎస్ఎన్ఎల్‌యూ ఫస్ట్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై సత్యనారాయణ తెలిపారు. మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల సాధనకు అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సందర్భంగా మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖ నగరంలో పోర్టు, స్టీల్‌ప్లాంట్ ఇతర ఫార్మా కంపెనీల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దేశాలను పక్కాగా అమలు చేయాలన్నారు. మానవ హక్కుల కమిషన్ కూడా భాగస్వామ్యమై ఈ మేరకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సీతామాణిక్యం, సభ్యులు ఎస్వీ రమణ, పైడి రాజు, ఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ తొలేళ్ల పండగ


పండగలో పాల్గొన్న కేకే రాజు

అక్కయ్యపాలెం, మే 20: గ్రేటర్ 42వ వార్డులో వేంచేసిన పరదేశమ్మ తొలేళ్ళ పండగ మహోత్సవం సోమవారం జరిగింది. ఈసందర్భంగా ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, ఆళ్ళ శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నక్కవానిపాలెంలో అమ్మవారి పండగ

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు నక్కవానిపాలెంలో వెలసిన ఏడుగుళ్ల అమ్మవారి ఆలయంలో బెజవాడ కనకదుర్గమ్మ అనుపు మహోత్సవం మంగళవారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో, విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. ఆదివారం రాత్రి పీర్లు, సోమవారం రాత్రి తొలేళ్ల వేడుక నిర్వహించారు. గ్రామంలో రామాలయం వద్దనున్న పెద్దింటి వద్ద నుంచి మంగళవారం అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి పూజలు చేస్తారు. గ్రామం దొడ్డి పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పండగ జరగనుంది.

నేడు రెడ్డికంచరపాలెంలో....

కంచరపాలెం: రెడ్డికంచరపాలెం గ్రామ దేవత దుర్గాలమ్మ అమ్మవారి ప్రధాన పండగను మంగళవారం నిర్వహించనున్నట్టు గ్రామపెద్దలు, శ్రీరామా సేవాసంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తుమ్మడిపాలెం వద్ద గల ఆలయాన్ని దేదీప్యమానంగా విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరణ చేశారు. మంగళవారం అమ్మవారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో గల పుట్టబంగారం గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామమంతా ఘటాలతో భక్తులు ఊరేగింపు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మే 20: నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. శాంతినగర్, సంతోష్‌నగర్, సంజీవయ్య కాలనీ, కైలాసపురం ప్రధాన రహదారి, కస్తూరినగర్, మధుసూదన్‌నగర్, దుర్గా కైలాసనగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

లలితానగర్‌లో నేలకొరిగిన చెట్టు

అక్కయ్యపాలెం, మే 20 : గ్రేటర్ 26వ వార్డు లలితానగర్ సాక్షి లైన్‌లో చెట్టు విరిగి నేలకొరిగింది. ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు చెట్టుకొమ్మ రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. జీవీఎంసీ సిబ్బంది వచ్చి ఈ చెట్టును తొలగించారు.

ఉచితంగా సున్తీ వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, మే 20: పేద ముస్లిం పిల్లలకు రైల్వేన్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో శీరత్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత సున్తీ వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఉత్తరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, గౌరవాధ్యక్షుడు హైదరాలి సింకా మాట్లాడుతూ సుమారు 250 మంది కి విజయవాడ నుంచి వచ్చిన వైద్యుడు మౌలాలి ద్వారా ఈ ఉచిత వైద్యశిబిరం చేపట్టారన్నారు.


ఎల్‌ఐసీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న సెంట్రల్ పార్కు ప్రాంగణం


వీధి దీపాలులేక సాయంత్రం వేళలో కటిక చీకటిగా ఉన్న ఫుట్‌పాత్ రహదారి

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

- ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన సెంట్రల్ పార్కు ఆవరణలో దుస్థితి
- చీకటిపడితే వ్యభిచారం, ట్రాన్స్‌జెండర్ల హల్‌చల్
- మద్యం, డ్రగ్స్ సేవనం..
- వీధి దీపాలులేక చెలరేగుతున్న మూకలు
- ప్రశ్నిస్తున్న వారిపై ఎదురుదాడులు

మహారాణిపేట, మే 20: నగరం నడిబొడ్డున ఉన్న ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటిపడితేచాలు వ్యభిచారం, ట్రాన్స్‌జెండర్స్ అలజడి, పలువురు మద్యం, డ్రగ్స్ సేవనం తదితర విచ్చలవిడి పనులకు పాల్పడుతుండడంతో ఈ మార్గం గుండా వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంటోంది. నగరంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఎల్ఐసీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న సెంట్రల్ పార్కు వెలుపల ప్రాంగణంలో ఈ పరిస్థితి నెలకొంటోంది. సాయంత్రం ఆరు తరువాత ట్రాన్స్‌జెండర్లు, వ్యభిచారులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుంటారు. ఆ ప్రాంగణంలో విద్యుత్ లైట్లు లేకపోవడం, చెట్లు ఉండటంతో కటిక చీకటి అలుముకుంటోంది. దీంతో అసాంఘిక పనులకు అడ్డులేకుండా పోతోంది. ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి డాబాగార్డెన్స్ వైపునకు వచ్చే పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ట్రాన్స్‌జెండర్స్ అయితే, ఏకంగా వెకిలి చేష్టలతో హడలెత్తిస్తున్నారు. ఇదే ప్రాంతానికి సమీపంలోనే ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు ఈమార్గంలోనే ఆర్‌టీసీ కాంప్లెక్స్ వెళ్తుంటారు. ఇతర ప్రయాణికులు ఇక్కడి స్టాప్‌లో బస్సుల కోసం నిల్చుంటారు. అసాంఘిక కార్యకలాపాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పనులకు పాల్పడడంతోపాటు తిరిగి అభ్యంతరం వ్యక్తంచేసిన వారిపై దాడులు చేసేందుకు వెనుకాడడంలేదు. గతంలో ఈ ప్రాంతంలో చేతిలో ఉన్న సెల్ ఫోన్లు సైతం పలువురినుంచి లాక్కొని వెళ్లిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇక్కడి జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై అనేకసార్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు వెళ్లాయి. దీంతో ఇక్కడ అక్రమంగా పార్కింగ్ చేస్తున్న వ్యాన్‌లు, ట్యాంకర్స్, మినీ ఆటోలను అక్కడ నుంచి తొలగించి కొంత మేర అడ్డుకట్టవేశారు. తర్వాత పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి తర్వాత పెద్దగా పట్టించుకోవడంలేదు. దీంతో పరిస్థితి యథాతథంగా మారింది. ఈ ప్రాంతంలో ఏదైనా అఘాయిత్యం జరిగితే కానీ పోలీసులు స్పందించరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ దీపాల సమస్యపై సీఐ వినతినీ పట్టించుకోని వైనం

ఈ ప్రాంతంలో చీకటి ఉండటంతో అసాంఘిక పనులకు ఆస్కారం ఉంటుందని భావించి టూటౌన్ పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సీఐ) విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులు, జీవీఎంసీ అధికారులను వినతిపత్రం అందించారు. జీవీఎంసీ పట్టించుకోలేదు. ఇకనైనాస్పందించి ఈప్రాంతంలో విద్యుత్ లైట్లు వేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

బాధితుల వైపు నిలబడితే కేసులు పెడతారా...?

- బర్మా క్యాంప్ దాడి కేసులో నోటీసులు అందజేత అన్యాయం
- నార్త్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజు ఆవేదన


కంచరపాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట నోటీసు చూపుతున్న విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, మే 20 : టీడీపీకి ఓటువేశారనే నెపంతో దాడికి పాల్పడడంతో ఆ బాధితుల పక్షాన నిలబడిన తనపై కేసులుకట్టి అరెస్టు నోటీసులు అందిస్తారా..? అంటూ మాజీ ఎమ్మెల్యే, ఉత్తరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పి. విష్ణుకుమార్ రాజు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం బర్మా క్యాంప్‌లో టీడీపీకు ఓటు వేశారనే నెపంతో సుంకర ధనలక్ష్మి ఆమె కుటుంబ సభ్యులపై లోకేష్ అనే వ్యక్తి దాడి చేసిన విషయంపై తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులు విష్ణుకుమార్‌రాజును స్వయంగా కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. బాధితుల సమక్షంలో విష్ణుకుమార్‌రాజు ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేసి ఈ దుర్ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత గొడవలకు రాజకీయం అంటగడుతున్నారంటూ పోలీసులు కేసునమోదు చేసి ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీంతో సోమవారం విష్ణుకుమార్ రాజు ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్‌తో కలిసి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు హాజరై బెయిల్ పొందారు. అనంతరం విష్ణుకుమార్ మీడియాతో మాట్లాడుతు తీవ్రగాయాలు పాలైన బాధితులు తనవద్దకు వచ్చి జరిగిన ఘటనను వివరిస్తే తాను మాట్లాడానని, ఒక ప్రజాప్రతినిధిగా తనకు ఆ మాత్రం వాక్ స్వాతంత్ర్యం లేదా అని ప్రశ్నించారు. ఏ ఫిర్యాదు లేకున్నా 41ఏ నోటీసులిచ్చి తనపై పలు కేసులు పెట్టారన్నారు. అలాగే బాధితుల గోడును వెలుగులోకి తీసుకువచ్చిన మీడియాపైనా కేసులు పెట్టడం దారుణమన్నారు.

చంద్రబాబు, పవన్‌లపై దాడులపై స్పందనలేదేమీ?

గతంలో విశాఖ వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును ఎయిర్ పోర్టు నుంచి బయటకు రానీయకుండా అడ్డుకుని వాటిల్ బాటిల్స్ విసిరి అసభ్యకరంగా మాట్లాడిన వారిపై ఎందుకు కేసులు కట్టలేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోవాటెల్ నుంచి పోర్టు స్టేడియంకు బయలుదేరకుండా అడ్డుకున్నప్పుడు సుమోటాలు పోలీసులకు గుర్తుకురాలేదా అని వాపోయారు. ప్రజలకు భంగం కలిగించడం తన ఉద్దేశం కాదని, చట్టాన్ని గౌరవించే సంస్కారం తనకు ఉందన్నారు. పోలీసుల తీరుతో ఇకపై అన్యాయానికి గురైన బాధితుల తరపు నుంచి మీడియాలో వెలుగులోకి తీసుకురావడం, వారి తరపున ప్రజా ప్రతినిధులు మాట్లాడం అన్యాయమైతే.. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సనపల వరప్రసాద్, కుట్టా కార్తీక్, బీజేపీ నాయకుడు రంగు ముద్ర రాంబాబు ఉన్నారు.

వైసీపీకి ఓటు వేయనందుకే దాడి చేశారు

- బర్మా క్యాంపు బాధిత కుటుంబం ఆరోపణ
- తమకు రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌కు...
- పోలీస్ కమిషనర్‌ను కలవాల్సిందిగా సూచించిన జేసీ


కలెక్టరేట్ ఎదుట బర్మా క్యాంప్ బాధిత కుటుంబం

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి కాకుండా టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేశామనే కక్షతో తమపై కొందరు మారణాయుధాలతో దాడి చేసి అంతమొందించేందుకు యత్నించారని బర్మా క్యాంపునకు చెందిన సుంకరి నూకరత్నం ఆరోపించారు. తల్లి ధనలక్ష్మి, సోదరుడు మణికంఠ, సోదరి రమ్యతో కలిసి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె అక్కడ విలేకరులతో మాట్లాడుతూ జీవనోపాధి కోసం ఇంటి వద్ద చిన్న పాన్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా విష్ణుకుమార్‌రాజు ఉన్న సమయంలో పీఎంఏవై పథకం కింద ఇల్లు నిర్మించుకున్నామన్నారు. దానికి సంబంధించి శిలాఫలకం ఇంటిగోడకు ఉంటుందన్నారు. ఈనెల 15వ తేదీ రాత్రి...అంటే పోలింగ్ ముగిసిన రెండు రోజులకు ఆ ప్రాంతానికి చెందిన వైసీపీ మద్దతుదారులు లోకేష్, భూలోక్, సాయి, భాస్కర్, చిన్ని, ఆశ తదితరులు తమ షాపు వద్దకు వచ్చి వైసీపీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో టీడీపీ, బీజేపీలకు ఓటు వేస్తారా?...అంటూ తమతో గొడవకు దిగడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. ఈ క్రమంలో తనతోపాటు ఇంట్లో ఉన్న తల్లి ధనలక్ష్మి, సోదరుడు మణికంఠ, గర్భవతి అయిన సోదరి రమ్యపై కూడా దాడి చేశారన్నారు. వైసీపీకి ఓటు వేయనందుకే కక్షగట్టి దాడులు చేశారని, అయితే వ్యక్తిగత వివాదంగా పోలీసులు కేసు కట్టారని నూకరత్నం ఆరోపించారు. ఈ వ్యవహారంపై తమ కుటుంబానికి రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జేసీ మయూర్ అశోక్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వగా, సీపీని కలవాలని సూచించారు.

చిన్నారులకు ఫుట్‌బాల్ కిట్లు పంపిణీ


శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 20: ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ ఆటగాడు దివంగత పి.కొండలరావు వర్ధంతి సందర్భంగా ఫుట్‌బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు సోమవారం ఫుట్‌బాల్ కిట్స్ పంపిణీ జరిగింది. నగరంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో స్టార్ ఫ్లెక్స్ స్పోర్టింగ్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాధికార సంస్థ క్రీడాభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సుస్మిత ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు ఫుట్‌బాల్ షూస్, జెర్సీ, బాల్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో మాట్లాడుతూ చిన్నారి ఫుట్‌బాలర్లను ప్రోత్సహించేందుకు శిబిరాల నిర్వహణతోపాటు విశాఖ ఫుట్‌బాల్ రంగానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన కొండలరావు జ్ఞాపకార్థం కిట్స్ పంపిణీ చేపట్టిన స్టార్ ఫ్లెక్స్ స్పోర్టింగ్ ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శిబిరాల చీఫ్ కోచ్, జాతీయ మాజీ ఫుట్‌బాలర్ శేషుమోహన్ (బుజ్జి), రామకృష్ణ, అశోక్, త్రినాధరావు (బాబు), సన్నీ పాల్గొన్నారు.

'విస్కో'లో అక్రమాలపై విచారణ జరపాలి

- సీపీఎం ఫ్లోర్‌లీడర్ గంగారావు డిమాండ్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇండస్ట్రీయల్ వాటర్ సప్లై కార్పొరేషన్ (విస్కో)లో జరుగుతున్న అక్రమాలపై తక్షణం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు లేఖ రాశారు. విస్కో నిధుల దుర్వినియోగంతోపాటు, ఓ ఐఏఎస్ అధికారికి చెందిన భవనాన్ని జీవీఎంసీకి గెస్ట్‌హౌస్ పేరుతో నెలకు రూ.20 లక్షలు అద్దె చెల్లింపే, విస్కో నిధులతో వాహనాలు కొనుగోలు, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు డిమాండ్ తదితర అంశాలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నాయన్నారు. విస్కోలో ఓ తాత్కాలిక ఉద్యోగి అవినీతికిపాల్పడుతున్నట్టు ఆరోపణలపైనా విచారణ జరిపి, నివేదికను జీవీఎంసీ కౌన్సిల్‌లో చర్చకు పెట్టాలని కోరారు. ముడసర్లోవలో నూతనంగా నిర్మించతలపెట్టిన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో విస్కోకి 50 శాతం భాగస్వామ్యం కల్పించారన్నారు. జీవీఎంసీ ఆస్తులను చట్టవిరుద్ధంగా విస్కోకి బదలాయించి, అక్కడ ప్రైవేటు వ్యక్తుల ఆజమాయిషీ ద్వారా వ్యాపార లావాదేవీలు చేసుకునే కుట్ర ఉందని గంగారావు ఆ లేఖలో పేర్కొన్నారు. వీటన్నింటిపైనా సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని కోరారు.

'డ్రా ద్వారానే పండ్ల దుకాణాలు కేటాయింపు'

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో పండ్ల దుకాణాలను డ్రా తీసే కేటాయించినట్టు జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎవరి జోక్యంలేదన్నారు. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌ఓ, ఉద్యాన శాఖాధికారి ఇచ్చిన ధ్రువీకరణల ఆధారంగానే దుకాణాలు కేటాయించామని వివరించారు.

కిటకిటలాడిన ప్రాంతీయ కంటి ఆసుపత్రి

- ఓపీకి 600పైగా రాక .. ఐదేళ్ల తర్వాత అత్యధికంగా నమోదు


ఆసుపత్రిలో వైద్యం కోసం వేచి ఉన్న జనం

సీతంపేట, మే 20: రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్ ఎదురుగా గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి సోమవారం వైద్యం కోసం వచ్చిన జనంతో కిటకిటలాడింది. గత ఐదేళ్లుగా ఏ రోజు లేని విధంగా వందల సంఖ్యలో రోగులు విచ్చేసి వైద్య పరీక్షల కోసం నిరీక్షించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో దూర ప్రాంతాల నుంచి సైతం ప్రజలు సైతం కంటి వైద్య పరీక్షల కోసం వచ్చారు. కరోనా ముందు ఈ విధంగా ఈ ఆసుపత్రికి అధిక సంఖ్యలో విచ్చేసేవారు. ఈ ఐదేళ్లలో ఈరోజే ఇంత పెద్ద మొత్తంలో 600కు పైగా జనం రావడంపై ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది విస్మయం వ్యక్తంచేస్తున్నారు. అయితే, ఆసుపత్రికి వచ్చిన వారందరికీ నేత్ర వైద్యశాల సూపరెంటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో వైద్యులు వైద్య పరీక్షలు పూర్తి స్థాయిలో అందించారు. అయితే, రోగులు ఒక్కో గది వద్ద వైద్య పరీక్షల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో పలువురు అసహనం వ్యక్తంచేశారు.

ఓటెత్తిన గ్రామీణం

... 3వ పేజీ తరువాయి

ఓటర్లు నగర పరిధి (మధురవాడ, కొమ్మాది, సాగర్‌నగర్, ఎండాడ)లో ఉండగా మిగిలిన వారంతా మూడు మండలాల్లో ఉన్నారు. ఈ సెగ్మెంట్‌లో అత్యధికంగా పద్మనాభం మండలం లింగన్నపేటలో బూత్ నంబరు 13లో 96.83 శాతం ఓట్లు పోలవ్వగా తక్కువగా ఐఎన్‌ఎస్ కళింగలో ఉన్న ఉద్యోగులు, అధికారుల కోసం నేరేళ్లవలసలో ఏర్పాటుచేసిన బూత్ నంబరు 189లో 98 మంది ఓటర్లకు (60 మంది పురుషులు, 38 మంది మహిళలు)గాను 43 మంది (24 మంది పురుషులు, 19మంది మహిళలు) ఓటు వేశారు. ఓటింగ్ శాతం 43.88 శాతం జరిగింది. నియోజక వర్గంలో 90 శాతం, అంతకంటే ఎక్కువ ఓటింగ్ 50 కేంద్రాల్లో జరిగింది.

విశాఖ తూర్పులో..

విశాఖ తూర్పు నియోజకవర్గంలో 68.64 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 2,92,206 మంది ఓటర్లు ఉండగా 293 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. అత్యధికంగా తోటగరువు బీఎస్‌ఆర్ నగర్‌లో బూత్ నంబరు-70లో 1,525 మందికి 1,231 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అతి తక్కువగా ఎంవీపీ కాలనీ సెక్టార్-5లో బూత్ నంబరు-114లో 287 మంది ఓటర్లకు 184 మంది ఓటు వేశారు.

విశాఖ దక్షిణలో

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 2,16,770 మంది ఓటర్లు ఉండగా 237 బూత్‌లు ఏర్పాటుచేయగా 1,37,474 మంది (63.43 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. అతి తక్కువ ఓట్లు పోలైన నియోజక వర్గాల్లో రాష్ట్రంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం రెండో స్థానంలో నిలిచింది. వైర్‌లెస్ కాలనీ బూత్ నంబరు 55లో కేవలం 34 ఓట్లు మాత్రమే ఉండగా 23 (67.64 శాతం) ఓట్లు పోలయ్యాయి.

ఉత్తరంలో

ఉత్తర నియోజకవర్గంలో 2,85,789 మంది ఓటర్లకు 275 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. వీరిలో 1,84,703 మంది (64.63 శాతం) ఓటు వేశారు. అత్యధికంగా సత్యానగర్‌లో 980 మందికి 822 మంది (84 శాతం) ఓటు హక్కు వినియోగించుకోగా, తక్కువగా నరసింహనగర్ బూత్ నంబరు 124లో 1,163 మందికి 490 (42 శాతం) మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విశాఖ పశ్చిమలో

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 222 పోలింగ్ బూత్‌లలో 2,13,439 మంది ఓటర్లకుగాను 1,48,942 మంది (69.78శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 50 శాతం కంటే తక్కువ పోలింగ్ ఏడుచోట్ల నమోదైంది. అత్యధికంగా గోపాలపట్నం ఇంద్రానగర్ బూత్ నంబరు 13లో 88.55, గవర కంచరపాలెం బూత్ నంబరు 191లో 88.2 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తక్కువగా ఐఎన్‌ఎస్ డేగాలో పనిచేసే ఉద్యోగులు ఉండే విమాననగర్‌లో కేవలం 7.74 శాతం మంది ఓట్లు వేశారు. విమాననగర్ కోసం ఏర్పాటుచేసిన బూత్ నంబరు 213లో 620 మంది ఓటర్లు ఉండగా కేవలం 48 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గాజువాకలో..

రాష్ట్రంలో ఎక్కువగా ఓటర్లు ఉన్న నియోజకవర్గాల్లో భీమిలి తరువాత స్థానం గాజువాకదే. గాజువాకలో 3,33,661 మంది ఓటర్లు ఉండగా 2,32,949 (69.83 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా బూత్ నంబరు 190లో 937 మందికి 814 మంది (86.87 శాతం) ఓటు వేయగా, తక్కువగా బూత్ నంబర్ 46లో 705 మందికి 322 మంది (45.67 శాతం) ఓటు వేశారు.

ఎస్.కోటలో

ఎస్.కోటలో 2,22,475 మందికి 1,90,104 మంది ఓటు హక్కు (85.45 శాతం) వినియోగించుకున్నారు. అత్యధికంగా లింగంపేటలో 787 మందికి 751 మంది (95.43 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. దాదాపు 220 బూత్‌లలో 80 నుంచి 95 శాతం వరకు ఓట్లు పోలయ్యాయి. అతి తక్కువగా ఎస్.కోట బూత్ నంబరు 19లో 803 మందికి 433 మంది (53.92 శాతం) ఓటు వేశారు.

ఆలయ నిర్వహణపై వివాదం

... 3వ పేజీ తరువాయి

ఇబ్బందిగా భావించి ప్రభుత్వ పెద్దలను పట్టుకొని సెక్షన్ 29 కింద మినహాయింపు తెచ్చుకున్నారు. ఐదేళ్లపాటు వారే నిర్వహించుకునేలా ఆదేశాలు తెప్పించుకున్నారు. గత ఏడాది అది ముగిసిపోవడంతో మరో ప్రయత్నం చేసి విఫలమయ్యారు.

ఇవీ ఫిర్యాదులు, ఆరోపణలు

- ఆలయంలో వాహన పూజలు చేయించుకునే వారి వద్ద డబ్బులు తీసుకొని రశీదులు ఇవ్వడం లేదు.
- అభిషేకాలు, సేవల కోసం అర్చకులు భక్తుల నుంచి పెద్ద మొత్తాలు వసూలు చేస్తున్నారు.
- రెగ్యులర్‌గా హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తూ సామాన్య భక్తులను అనుమతించడం లేదు.
- ధనికులు, వీవీఐపీలకు మాత్రమే ప్రత్యేక పూజలు చేస్తూ వారి నుంచి భారీగా విరాళాలు పొందుతున్నారు.
- ఆలయ నిర్వహణలో సంబంధం లేని వ్యక్తులు పాల్గొంటూ భక్తులను ఇబ్బంది పెడుతున్నారు.
- ఆలయ ఉద్యోగులను వ్యక్తిగత పనులకు ఉపయోగించుకుంటున్నారు.
- అన్నదానం రోజూ చేయాల్సి ఉండగా నచ్చినప్పుడే పెడుతున్నారు. టోకెన్ల జారీలో పారదర్శకత లేదు.
- అర్చకుల వసూళ్లు, పెత్తనం పెరిగిపోయింది. దానిని వ్యవస్థాపక ట్రస్టీలు నియంత్రించలేకపోతున్నారు. ...ఇలా అనేక ఫిర్యాదులు, ఆరోపణలు అందడంతో, వీటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. నెల రోజుల్లో నివేదిక సమర్పించాల్సి ఉంది.

డెంగ్యూ బెల్స్

... 3వ పేజీ తరువాయి

నెల మధ్యనాటికే 146 డెంగ్యూ కేసులు నమోదైతే, జూన్ నాటికి డెంగ్యూ విశ్వరూపం చూడాల్సి ఉంటుందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటినుంచే దీనిపై దృష్టిసారించకపోతే రికార్డు స్థాయిలో కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. అందువల్లే నెల రోజులు ముందుగానే దోమల నియంత్రణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్ ప్రారంభించారు. ప్రతిరోజూ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి దోమల లార్వాలను గుర్తించి నిర్వీర్యం చేసే పనికి శ్రీకారం చుట్టారని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వివరించారు. డెంగ్యూ తీవ్రత గత ఏడాదితో పోల్చితే తక్కువగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. జిల్లా మలేరియా విభాగం ఇచ్చే నివేదికలో డెంగ్యూ కేసులు ఉన్నట్టు చెబుతుంటే, జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం మాత్రం అలాంటి కేసులు లేవని చెప్పడం గురించి ప్రశ్నించగా...క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నరేష్‌కుమార్ అన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


డాబాగార్డెన్స్, మే 20: జ్యోతిషం, సోషల్ సర్వీసెస్‌లలో ప్రతిభ చూపిన విజయనగరం జిల్లాకు చెందిన డా.పిచ్చుక సత్యశ్రీనివాస్‌కు భారత గౌరవ రత్న అవార్డు వరించింది. ఈ నేపథ్యంలో లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్ జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆయననుసత్కరించారు. ప్రముఖ న్యాయవాది అరుణకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యశ్రీనివాస్ పార్లమెంటరీ చైర్మన్, గోవా మాజీ సీఎం మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. లాయర్స్ ఫోరంఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్రఅధ్యక్షుడు గుడుపల్లి సుబ్బారావు, బోసుబాబు, మూర్తి, బంగారి పాల్గొన్నారు.

అదంతా రెడ్ జోన్

... 3వ పేజీ తరువాయి

కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గంతో పాటు ఆ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఏయూలో భద్రపరిచిన విషయం తెలిసిందే. స్ట్రాంగ్‌రూమ్‌లకు రెండు కిలోమీటర్ల పరిధిని నోఫ్లయింగ్‌జోన్‌గా పరిగణిస్తున్నందున ఆ ప్రాంతంలో ఎలాంటి డ్రోన్లు, బెలూన్లు ఎగరవేయడానికి వీల్లేదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో అభిమానులు

డాబాగార్డెన్స్, మే 20: జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ సిటీవైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ స్టేట్‌వైడ్ కన్వీనర్ నొడగలనాయుడు, జి.ధనరాజ్, తాడి ప్రసాద్, నీల అప్పన్న, నాగిరెడ్డి, దాసు, వరలక్ష్మి, ఎన్.రాజు, పి.ప్రసాద్, ఎన్.ధర్మ, సీహెచ్ అప్పారావు, బి. వాసు, పి. కొండలరావు పాల్గొన్నారు.

'అధ్యాపకురాలిపై వీసీ కక్ష సాధింపు చర్యలు తగవు'

మహారాణిపేట, మే 20: బీసీ వర్గానికి చెందిన విద్యావేత్త, అధ్యాపకురాలు డాక్టర్ లావణ్య దేవిని రాజకీయ కక్షతో ఏయూ వీసీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు సతీమణి అయిన డాక్టర్ లావణ్య దేవి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారనే అనే నేపంతో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి ఆమెను సస్పెండ్ చేశారని, ఈ చర్యను ఖండిస్తున్నామన్నారు. హిందూ ధర్మం ప్రకారం తన భర్త శాసన సభ్యుడిగా పోటీ చేస్తుంటే భార్యగా కనీస ధర్మం పాటించడం తప్పా అని ప్రశ్నించారు. వైసీపీ కండువా కప్పుకున్న కార్యకర్తగా వీసీ ప్రసాదరెడ్డి ప్రవర్తిస్తున్నారని ఆయన ఆరోపించారు.


కల్యాణం చేస్తున్న అర్చకులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, మే 20 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు.ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి ఉపచారాలు సమర్పించి, నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజ జరిపారు. ఉదయం 9.30 గంటలకు పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మంత్ర పుష్పం, కర్పూరనీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వైసీపీ నేతగా ఏయూ వీసీ : ప్రణవ్

వెంకోజీపాలెం, మే 20 : ఏయూ వీసీ ప్రసాదరెడ్డి వైసీపీ నేతగా వ్యవహరిస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్ ఆరోపించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గాజువాక కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు సతీమణి డాక్టర్ లావణ్యదేవిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళా విద్యావేత్త పట్ల అప్రజాస్వామికంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు, ఇప్పటికే ఏయూను వైసీపీ కార్యాలయంగా మార్చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సమయంలో వివిధ కళాశాలల కరస్పాండెంట్‌లతో మీటింగ్ పెట్టిన వీసీపై ఏ చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు. ఏయూను అడ్డం పెట్టుకుని వీసీ చేస్తున్న దారుణాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

పద్మనాభం (రూరల్), మే 20 : పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణం కోసం అక్రమంగా వేసిన పునాదులను పోలీసుల సమక్షంలో రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. గ్రామ సమీపంలోని కొండపై గ్రామానికి చెందిన కొంతమంది ఇళ్ల నిర్మాణానికి ఉపక్రమించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ వెంకటరావు తక్షణమే స్పందించి పోలీసుల సహకారంతో వాటిని తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

సింహాచలం, మే 20 : ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు 98వ వార్డులో సోమవారం ఘనంగా జరిగాయి. తొలిపావంచా వద్ద అభిమానులు ఎన్టీఆర్ పేరిట స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సింహాచలం ప్రధాన కూడలి వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానుల సంఘం ప్రతినిధులు పాశర్ల తరుణ్ ఆదిత్య, పాశర్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గెద్దపేటలో రాజ్యలక్ష్మి అమ్మవారి పండగ రేపు



పద్మనాభం, మే 20 : మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో బుధవారం నుంచి రాజ్యలక్ష్మి అమ్మవారి పండగ జరగనుంది. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. 22న తొలేళ్లోత్సవం, 23న అనుపోత్సవం సందర్భంగా భారీ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి జాతర, రథాల ఊరేగింపు చేపట్టనున్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 27, టమాటా 28, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 32, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 160, బరబటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 35, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 138
ఫారం ధర	-- 158
విత్ స్కిన్	-- 286
స్కిన్‌లెస్	-- 296

వైసీపీ ప్రభుత్వంపై జనాగ్రహం

- జూన్ 9న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం
- ఆత్మీయ సమావేశంలో గంటా


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 20 : భీమిలి నియోజకవర్గంలో సాధించనున్న భారీ మెజారిటీకి కారణమైన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు అండగా ఉంటానని నియోజకవర్గం కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు.ఎన్నికల్లో పనిచేసిన ఇన్‌చార్జిలు, నాయకులు, శ్రేయోభిలాషులతో వాల్తేర్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కోసం ఎంతో అభిమానంతో పనిచేసిన ఎన్నికల టీం ఉండడం తన అదృష్టమన్నారు. కుటుంబ సభ్యుడు పోటీ చేస్తే ఎంత కష్టపడి పనిచేస్తారో అంతకంటే ఎక్కువగా పనిచేశారన్నారు. జగన్ దుర్మార్గపు పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, జూన్ 4న ఎన్నికల ఫలితాల రూపంలో అది కనిపించబోతుందని చెప్పారు. జగన్‌ను గద్దెదింపడానికి అన్ని వర్గాల ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వెల్లువెత్తారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, జూన్ 9న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు. భీమిలి నుంచి పోటీ చేయడానికి నాలుగున్నరేళ్ల కష్టపడి పార్టీని నడిపించిన కోరాడ రాజబాబు ఎన్నికల సమయంలో ముందుండి పని చేశారని ప్రశంసించారు. భీమిలి నుంచి జనసేన తరఫున పోటీ చేయాలని పంచకర్ల సందీప్ ఆశించినప్పటికీ పూర్తి సహకారం అందించారని చెప్పారు. బీజేపీ ఇన్‌చార్జి రామునాయుడు నిరంతరం తన వెంటే ఉండి మిత్రపక్ష స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. అనంతరం భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, వార్డుల ఇన్‌చార్జిలను గంటా సన్మానించారు.

మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం

జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి రాధారత్నం


శిబిరంలో పాల్గొన్న న్యాయాధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు రాధారత్నం

విశాఖపట్నం (లీగల్), మే 20 : న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంతో పాటు సత్వర న్యాయానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు కె. రాధారత్నం అన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ, ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా నూతన కోర్టుల కాన్ఫరెన్సు హాలులో న్యాయాధికారుల ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన మెళుకువలను తెలుసుకొని కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలన్నారు. వివాహ సంబంధ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ జాతీయ శిక్షకులు బన్సల్, సునీల్ కుమార్ అగర్వాల్, పాల్గొన్నారు.

అప్పన్నకు ఒడిశా దాసుడు పూజలు


స్వామివారి దర్శనానికి వెళ్తున్న దాసుడు

సింహాచలం, మే 20 : ఒడిశాలోని బరంపురం జిల్లా పట్టుపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు సోమవారం వరాహలక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. ఏటా స్వామివారి నిజరూప దర్శనం చందనోత్సవం తరువాత బంధుమిత్రులు, శిష్య పరివారంతో ఆయన సింహగిరికి వచ్చి మూడు నెలలు పాటు తమ భవనంలో బస చేసి ప్రతిరోజూ స్వామివారిని పూజిం చడం ఆనవాయితీ. ఈమేరకు ఆయన స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని నూనె భండారం వద్ద ప్రత్యేక దీపారాధనలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


మద్ది ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీధర్‌బాబు

సకాలంలో ఎరువులు, విత్తనాలు పంపిణీ

మార్క్‌ఫెడ్ ఎండీ శేఖర్‌బాబు

పద్మనాభం, మే 20 : రైతులకు ఖరీఫ్ కాలానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో పంపిణీ చేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ డి. శేఖర్‌బాబు చెప్పారు. సోమవారం ఆయన మద్దిలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ముందుగా రైతులకు ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేస్తున్న ఎరువులు, విత్తనాల పంపిణీపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు లు మాట్లాడుతూ సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా కావడం లేదన్నారు. పంట చేతికి వచ్చిన చాలా రోజుల వరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయకపోవడం వల్ల పండించిన దినసులను అమ్ముకోలేకపోతున్నామని చెప్పారు. దీనిపై ఎండీ స్పందిస్తూ ఈఏడాది నుంచి రైతులకు అవసరమైన ఎరువులు, ఖరీఫ్ విత్తనాలు, అపరాల విత్తనాలు సకాలంలో ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. ఇక నుంచి మొక్కజొన్న, రాగులు తదితర పంటలు పక్వానికి వచ్చిన 15 రోజుల ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈమేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు క్యాలెండరు రూపొందించాలని వ్యవసాయ శాఖ ఏడీ శేఖర్‌బాబును ఆదేశించారు. అలాగే రైతులందరికీ ఎరువులు అందుబాటులో ఉంచడానికి మండల స్థాయిలో గిడ్డంగి ఏర్పాటు చేసి ఎరువులు నిల్వ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె. అప్పలస్వామి, విశాఖ, విజయనగరం మార్క్‌ఫెడ్ డీఎంలు రమేష్, విమల, వ్యవసాయ శాఖ ఏడీ విజయప్రసాద్, ఎంపీఈఓ శ్రీనివాస్, వీఏఓ రమ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం సందర్శన

ఆనందపురం : మండలంలోని జోని రైతు భరోసా కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రం ద్వారా రైతులకు పంపిణీ చేసిన ఎరువుల వివరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ గోదాములు, అందుబాటులో వున్న గోదాముల్లో ఎరువులు నిల్వ చేసుకోవాలని చెప్పారు. ఎరువుల పంపిణీలో జాప్యాన్ని నివారించేందుకు ప్రతి రైతు భరోసా కేంద్రంలో కనీసం 20 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. మద్దిలో మొక్కజొన్న, చోడిపంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి కె. అప్పలస్వామి, భీమిలి సహాయ వ్యవసాయ సంచాలకుడు విజయ్‌ప్రసాద్, ఆనందపురం ఏఓ సంధ్యరత్నప్రభ ఉన్నారు.

అన్నమయ్య సంకీర్తన శిక్షణ తరగతులు ప్రారంభం


విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న జ్యోతిర్మయి

ఆరిలోవ, మే 20 : హనుమంతవాక భక్త తుకారం రామాలయంలో సోమవారం నుంచి అన్నమయ్య సంకీర్తన శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ సంకీర్తన రాయబారి కొండవీటి జ్యోతిర్మయి మాట్లాడుతూ శిక్షణలో మొదటి రోజు వంద మంది పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈనెల 24 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. తొలుత ఆమె భక్త తుకారం విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయం కార్యదర్శి జయరాం, జాయింట్ సెక్రటరీ సోమేష్, కమిటీ సభ్యులు దుర్గా ప్రసాద్ పండా, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

గోపాలపట్నం, మే 20 : అనారోగ్య సమస్యల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన 89వ వార్డు పరిధి సంతోశ్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. వంతల మోహనరావు అనే రైల్వే ఉద్యోగి భార్య పైడమ్మ (కమల), నలుగురు పిల్లలతో కలిసి కొత్తపాలెంలోని సంతోశ్‌నగర్ కాలనీలో నివసిస్తున్నారు. ఈ నెల 18న మోహనరావు తమ కుమారుడితో కలిసి తిరుపతి వెళ్లారు. ఆదివారం రాత్రి భోజనాలు చేశాక కమల ఒంటరిగా ఇంట్లో నిద్రించగా, ముగ్గురు పిల్లలు మేడపై పడుకున్నారు. అయితే సోమవారం ఉద యం పిల్లలు కిందకు వచ్చి చూసేసరికి తల్లి వంట గదిలోని ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరి వేసుకుని ఉండడం చూసి స్థానికులకు తెలిపారు. వారు వచ్చి చూసే సరికే ఆమె మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి, ఘటనపై ఆరా తీశారు. కమల అనారోగ్యం వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబీకులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

తగరపువలస, మే 20 : జీవీఎంసీ రెండో వార్డు సంతపేటలో సోమవారం పిచ్చి కుక్క దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సంతలో కూరగాయలు అమ్మడానికి వచ్చిన సూరయ్యపై దాడి చేసిన పిచ్చి కుక్క అక్కడికి సమీపంలోనే సీరపు లోకేష్, అభిరామ్ అనే చిన్నారులను కూడా గాయపర్చింది. స్థానికులు బాధితులను పట్టణ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా ఈ ప్రాంతంలో కుక్కల సంచారం అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. కూడళ్లలో గుంపుగా చేరి పాదచారులు, వాహనదారులపై దాడికి పాల్పడుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ వాహనాల వెంట పరుగు తీస్తుండడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

భాష అభ్యాసంతో మానవీయ విలువలు పెంపు

సాగర్‌నగర్, మే 20 : భాష అభ్యాసంతో మానవీయ విలువలను పెంపొందించవచ్చునని సాంఖ్య టెక్నాలజీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గోపికుమార్ అన్నారు. రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలో భాషా అభ్యాసం ద్వారా మానవీయ విలువలను సుసంపన్నం చేయడం అన్న అంశంపై కళాశాల ఆడిటోరియంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రపంచ విజ్ఞానానికి సంస్కృతం మూల భాష అన్నారు. భాషలపై పట్టు సాధించినప్పుడే వికసిత భారత్ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.

ప్రారంభోత్సవానికి నోచుకోని రైతు బజారు


నిర్మించి.. వదిలేసిన రైతు బజారు

ఆరిలోవ, మే 20 : జీవీఎంసీ పదో వార్డులోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకొని రూ. 80 లక్షలతో నిర్మించిన రైతు బజారు ఇప్పటి వరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. దీంతో ఆరిలోవ ప్రాంతంలోని ప్రజలు కూరగాయల కొనుగోలుకు ఎంవీపీ రైతు బజారుకు వెళుతున్నారు. స్థానికుల వినతుల మేరకు గత ఏడాది ఏప్రిల్ నెలలో రైతుబజారు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన రోజున మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ రైతు బజారు నిర్మాణాన్ని అదే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేసి, ప్రారంభిస్తామని తెలిపారు.ఈమేరకు 40 దుకాణాలతో రైతుబజారు నిర్మించారు. అయితే కాంట్రాక్టర్‌కు ఇంకా రూ. 20 లక్షల మేర బిల్లులు చెల్లించాల్సి ఉండడంతో ఆయన 80 శాతం పనులు పూర్తి చేసి విడిచిపెట్టారు. నాటి నుంచి రైతు బజారు పనులపై ఎవరూ దృష్టిసారించడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి రైతుబజారు ప్రారంభోత్సవానికి త్వరగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోతులతో పద్మనాభం-రెడ్డిపల్లి రోడ్డు


ప్రమాదకరంగా ఉన్న పైప్‌లైన్ కోసం తవ్విన గొయ్యి

పద్మనాభం, మే 20 : పద్మనాభం - రెడ్డిపల్లి రోడ్డు గోతులతో అధ్వానంగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో అధికారుల అలసత్వం వల్ల పైపులైను కోసం తవ్విన గోతులను పూర్తి స్థాయిలో పూడ్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తాగునీటి పైపులైను వేయడానికి ఎక్కడికక్కడ రోడ్డును తవ్వి, వాటిని పూర్తిగా కప్పకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. రెడ్డిపల్లిలో రెండు చోట్ల, అర్చకునిపాలెం సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డుకు అడ్డంగా గొయ్యి తవ్వి పైపులైను వేసిన తరువాత వాటిని పూర్తిగా కప్పి వెట్ మిక్సరుతో గట్టిగా రోలింగు చేయించకపోవడంతో గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. ఏమాత్రం వర్షం పడినా గోతులు నీటితో నిండి ఉండడంతో వాహనదారులకు గొయ్యి ఉందన్న సంగతి తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పైపుల కోసం తవ్విన గోతులను పూర్తిస్థాయిలో పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


గంటాను కలిసిన టీఎన్‌టీయూసీ కార్మికులు

కార్మికులకు అండగా ఉంటాం : గంటా

ఎంవీపీ కాలనీ, మే 20 : తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని మాజీ మంత్రి, భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలోని చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర బృందం ఎంవీపీ కాలనీలో గంటాను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు ఆధ్వర్యంలో అన్ని వర్గాల కార్మిక సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోసం తయారు చేసిన నివేదికను గంటాకు అందించారు. అనంతరం గంటా మాట్లాడుతూ కార్మిక సంక్షేమానికి మేనిఫెస్టోలో పలు అంశాలను పొందుపరిచినట్టు చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేవిధంగా చంద్రబాబు పాలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు నాగోతు శివాజీ, పొట్ల శ్రీనివాస్, కృష్ణ, ప్రణయ్ పాల్గొన్నారు.

మూడు రోజుల్లో 112 కిలోల చందనం అరగదీత

సింహాచలం, మే 20 : సింహాద్రినాథునికి ఈనెల 23న రెండో విడత చందనం సమర్పణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ఈనెల 18న ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది 40 కిలోలు, 19న 37 కిలోలు చందనం అరగదీయగా సోమవారం మరో 35 కిలోలు చందనం అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనపు ముద్దను ఆలయ ఏఈఓ ఆనందకుమార్, స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి పద్మనిధిలో భద్రపరిచారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్ప స్తంభం వద్ద జెన్‌కో సీఎండీ చక్రధర్‌బాబు దంపతులు

సింహాచలం, మే 20 : వరాహలక్ష్మీనృసింహ స్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో జెన్‌కో సీఎండీ కేవీఎస్ చక్రధర్‌బాబు, విజయనగరం ఎంపీ కూటమి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఉన్నారు. ఆలయ ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి వెంకటరమణ వారికి ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా, గోదాదేవి దర్శనం తరువాత అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


సూపరింటెండెంట్ అప్పలరాజుకు వినతిపత్రం అందిస్తున్న శివాజీ

కొమ్మాది, మే 20 : మధురవాడలోని వాంబే కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ కోరారు. సోమవారం ఆయన జీవీఎంసీ జోన్ -2 కార్యాలయంలో సూపరింటెండెంట్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, మెట్లకు మరమ్మతులు చేయాలని, సీసీ రోడ్డు నిర్మించాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలని, వీధి లైట్లను బాగు చేయాలని విన్నవిం చారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు ఉన్నారు.

శరవేగంగా స్వాతి నక్షత్ర హవనం ఏర్పాట్లు


హోమకుండం పనులు చేస్తున్న కార్మికులు

సింహాచలం, మే 20 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని బుధవారం నిర్వహించనున్న 'స్వాతి నక్షత్ర హవనం ఏర్పాట్లను ఇంజినీరింగ్ అధికారులు శరవేగంగా చేపడు తున్నారు. ఈమేరకు ఆలయ ఉత్తర రాజగోపురానికి ఎదురుగా పాత కల్యాణ మైదానంలో తుప్పలను తొలగించి, వైదిక అధికారుల సూచనల మేరకు హోమ కుండం నిర్మించారు. హవనంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనుండడంతో అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

వెంకోజీపాలెం, మే 20 : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో సోమవారం తెల్ల వారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ఈ ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సామాజిక భవనం పక్కన ఉంటున్న వెరమశెట్టి ఈశ్వరమ్మ తన కుమా ర్తెలు లక్ష్మి, రామలక్ష్మితో కలిసి నిద్రలో ఉండగా అకస్మాతుగా మంటలు వ్యాపించాయి.దీంతో వారు హుటాహుటీన లేచి స్థానికుల సహాయంలో మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు చాలావరకూ కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ బాధితురాలికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు మళ్ల రవికుమార్, కణితి నాగరాజు, సన్యాసమ్మ, మహేష్, కర్రి గౌరీ పాల్గొన్నారు.

కోలుకున్న కేజీహెచ్ సూపరింటెండెంట్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ కోలుకున్నారు. గుండె పోటుకు గురైన ఆయనకు కేర్ ఆస్పత్రిలో పేస్ మేకర్ వేశారు.ఆదివారం సాయంత్రానికి కోలుకున్న ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. రెండు రోజుల్లో విధులు చేరతానని తెలిపారు. పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు ఆయన వెల్లడించారు.

సుందరయ్య జీవితం.. ఆదర్శప్రాయం

ఆరిలోవ, మే 20 : పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని సోమవా రం జూపార్కు ఆవరణలో పలువురు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రజల చేతికి అధికారం రావాలంటే గ్రామ స్థాయిలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలంగా ఉండాలని నమ్మిన వ్యక్తి సుందరయ్య అన్నారు. ఆయన రాసిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం అన్న పుస్తకంలో అనేక అంశాలు యువతకు ఆదర్శనీయమని చెప్పారు. సుందరయ్య ఆశయ సాధ నకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రియాంక, నాగరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు